సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
సోమవారం, 12.10.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 342
పేజీలు: 08 వెల: రూ. 5

## చెన్నైకి కొత్త మెట్రో

**కలిసి ప్రయాణించిన మోదీ విజయ్**

- ఫేజ్ 2లో తొలి కీలక కారిడార్ కు శ్రీకారం
- పూనమల్లి-వరపళని మధ్య 15 కి. మీ. కారిడార్ అందుబాటులోకి
- 4,900 కోట్లతో 11 ఎలివేటెడ్ స్టేషన్ల నిర్మాణం


02

## ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా

**డేట్ ఫిక్స్ చెయ్**

- తెలంగాణలో 70 లక్షలకు పైగా ఓట్లు తొలగింపు
- రాంచందర్‌రావుకు మంత్రి పొన్నం ఛాలెంజ్


02

## పట్టణ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు



02

**కీలక ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ సర్కార్**

- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై కొత్త జీవో
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం మించొద్దని స్పష్టం
- మేయర్లు, ఛైర్ పర్సన్లు, వార్డు సభ్యుల స్థానాలకు రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు
- డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు

## తహశీల్దార్ సస్పెన్షన్

**నువ్వింకా బతికే ఉన్నావా? పురుగుల మందు తాగలేదా? అంటూ నోటిదురుసు**

- ఆర్డీవో ప్రాథమిక నివేదిక
- రైతుపై అనుచిత వ్యాఖ్యలపై ప్రభుత్వం సీరియస్


02

## నిర్బంధాలతో ఉద్యమాన్ని

# ఆపలేరు

## మా పోరాటం ఆగదు: సీజేపీ

### జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంతవరకు వదలం

- మోదీ, అమిత్ షా ఎందుకు భయపడుతున్నారు?
- ఢిల్లీలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు
- విమానంలోనే అదుపులోకి తీసుకున్నారు
- మా ఫోన్లు లాక్కుని క్లోనింగ్ చేశారు
- నిరసన తెలిపే హక్కు లేదా?
- జ్ఞానేశ్‌ను కాపాడేందుకు యుద్ధమా
- జర్నలిస్టులనూ వేధిస్తున్నారు
- సీజేపీ నేతల విమర్శలు
- పోలీసుల నిర్బంధం నుంచి విడుదల

**ముద్ర, న్యూఢిల్లీ :**
సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని, జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు దేశ ప్రజలతోనే వీరు యుద్ధం చేస్తున్నారని కాక్రోచ్ జనతా పార్టీ అగ్రనేతలు విమర్శించారు. నిర్బంధాలు, కేసులతో మా పోరాటాన్ని ఆపలేరని, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంత వరకు మా పోరాటం ఆగదన్నారు. భానేశ్ కుమార్ ను ఎందుకు కాపాడుతున్నారు.. అంత అవసరం ఏముంది? జ్ఞానేశ్ ను కాపేడేందుకు దేశమంతా భయానక పరిస్థితి సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. జంతర్ మంతర్ ఆందోళనల నేపథ్యంలో పోలీసుల నిర్బందం నుంచి ఇవాళ విడుదలైన అనంతరం సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్ రంకా ఉమ్మడిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. నిన్న మమ్మల్ని విమానంలోనే అదుపులోకి తీసుకున్నారని కిడ్నాప్ చేసినట్లు విమానం నుంచే బలవంతంగా లాక్కెళ్లారని. నిన్న ఢిల్లోలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు కనిపించాయన్నారు. మిగతా 02లో



## సీజేపీ నేతల విడుదల

**ఏడాది పాటు శాంతియుతంగా ఉండాలని కోర్టు ఆదేశం**

**రూ.50,000 పూచీకత్తుతో కూడిన బెయిల్ బాండ్**

- నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో 3000 మందికి పైగా నిర్బంధం
- వారిలో మమత, కేజ్రీవాల్, పినరయి విజయన్ వంటి ప్రముఖులు


02



## ఎల్‌నినో సవాళ్లు

**ముందస్తు కార్యాచరణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం**

### రాష్ట్రంలో ప్రభావాలపై సీఎం అలర్ట్

- తాగు, సాగునీటి సంక్షోభాలపై ముందస్తు కార్యాచరణకు ఆదేశం
- విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచన
- వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు
- రైతుల పంటలు చేతికొచ్చే వరకు నీటి వృథాను అరికట్టాలి
- కరవు నివారణకు కేంద్రాన్ని రూ.20 వేల కోట్ల ప్యాకేజీ కోరిన తెలంగాణ
- ఎల్‌నినోపై ఈ నెల 12న మంత్రులతో సీఎం ప్రత్యేక సమావేశం

**ముద్ర, డెస్క్:**
రాష్ట్రంలో రానున్న ఎనిమిది నెలల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున, దానిని ఎదుర్కొనేందుకు పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో తాగు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సంక్షోభాలను అధిగమించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో ప్రజలకు వివరించాలని ఆయన స్పష్టం చేశారు.

**విద్యుత్ పొదుపు, ముందస్తు హెచ్చరికలు**
మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేయడానికైనా సిద్ధంగా ఉన్నప్పటికీ, సరిపడా విద్యుత్ అందుబాటులో లేకపోవచ్చని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్ సంబంధిత పనులను వాయిదా వేసుకునేలా మిగతా 02లో

## పడవ బోల్తా

**109 మంది మృతి**

- వలసదారుల పడవ ప్రమాదం.. 116 మందికి పైగా గల్లంతు
- 350 మందితో ప్రయాణం.. సముద్రంలో మృత్యుఘోష
- జిబూటి—యెమెన్ మార్గంలో ఘోర ప్రమాదం.. 80 మందికి పైగా సురక్షితం
- గల్ఫ్ ఆశల ప్రయాణంలో విషాదం..
- ఏటా వందలాది మంది బలి


02

## లిఫ్ట్ ప్రమాదం

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు తప్పిన ప్రమాదం**

- అడ్లూరి లక్ష్మణ్‌కు మరోసారి లిఫ్ట్ ప్రమాదం!
- స్వల్ప ఎత్తు నుంచి పడిన లిఫ్ట్
- సేఫ్‌గా బయటపడ్డ మంత్రి
- జగిత్యాలలో కలకలం


02

## కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ!

**హైస్పీడ్ రైల్ కారిడార్లపై కేంద్రం ప్రకటనతో రాజకీయ వేడి**

- అలైన్‌మెంట్లు ఖరారు కాలేదన్న కిషన్ రెడ్డి..
- భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వానికి కొత్త ప్రశ్నలు!

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణలో హైస్పీడ్ రైల్ కారిడార్ల అంశం రాజకీయ వివాదానికి దారితీస్తోంది. ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాలకు అనుసంధానించే రైల్ కారిడార్ల అలైన్ మెంట్లు ఇంకా ఖరారు కాలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించడంతో కాంగ్రెస్, బీజేపీ మధ్య కొత్త చర్చ మొదలైంది. అలైన్‌మెంట్లు నిర్ణయించకముందే భూసేకరణ పేరుతో రైతులను ఆందోళనకు గురిచేయడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో జరిగిన సమావేశం మిగతా 02లో



## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in | @mudranews

సోమవారం, 12 అక్టోబర్, 2026



### నీళ్లు ఎక్కువగా తాగండి

వేసవిలో శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలి. దాహం వేయకపోయినా ఎప్పటికప్పుడు నీళ్లు తాగాలి. బయట ఎక్కువసేపు పనిచేసేవారు ఓఆర్ఎస్ ద్రావణం లేదా వైద్యుల సూచన మేరకు ఎలక్ట్రోలైట్లు తీసుకోవచ్చు. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పుచ్చకాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం కూడా మంచిది.



## నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు

**(మొదటి పేజీ తరువాయి)**
గతంలో ఎమర్జెన్సీ గురించి మాత్రమే విన్నాం. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశామన్నారు. గతంలో ఎమర్జెన్సీ సమయంలోనూ రైళ్ల రద్దు జరగలేదు కానీ మోడీ హయాంలో మాత్రం పెద్ద సంఖ్యలో రైళ్లు రద్దు చేశారన్నారు. రైళ్లు, ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి.. ప్రజలను ఇబ్బంది పెట్టారన్నారు.

**మోడీ ఎందుకు భయపడుతున్నారు?:**
అత్యున్నత గొప్ప ప్రధాని కావాలని మోడీ చూస్తున్నారు. కానీ ప్రజలు, యువతను చూసి మోడీ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. 1975 తర్వాత మళ్లీ ఎమర్జెన్సీని దేశంలో చూస్తున్నాం. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా ప్రజలకు లేదా అని ప్రశ్నించారు. నిన్న ఢిల్లీలో 40 వేల మంది భద్రతా బలగాలను మోహరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, సరిహద్దుల నుంచి బలగాలను రప్పించారని ఆరోపించారు. జమ్ము-కశ్మీర్ సరిహద్దుల నుంచి కూడా బలగాలను రప్పించారు. ఢిల్లీలో రైళ్లు, మెట్రోరైలు సర్వీసులను రద్దు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టారు. నిన్న మమ్మల్ని మాఫియా ముఠాలను అరెస్టు చేసినట్లు చేశారు. మా సెల్ ఫోన్లను లాక్కుని ఎవరితో మాట్లాడకుండా చేశారు. ప్రైవేటు వాహనాల్లో ఒక్కొక్కరిని ఒక్కో ప్రాంతానికి తరలించారన్నారు.

**మా ఫోన్లు లాక్కుని క్లోనింగ్**
కనీసం లాయర్లను సంప్రదించే అవకాశం కూడా లేకుండా మా హక్కులను హరించారని, మా ఫోన్లను లాక్కుని హ్యాకింగ్, క్లోనింగ్ చేశారని ఆరోపించారు. సీజేపీ ముంబయి కో ఆర్డినేటర్ ప్రణయ్ ను కస్టడీలో హింసించారు. కస్టోడియల్ హింసపై కోర్టులు, మానవహక్కుల సంస్థలు స్పందించడం లేదు. నిన్న విధుల్లో ఉన్న పోలీసుల్లో ఎవరికీ నేమ్ బ్యాడ్జీలు లేవు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులను వేధిస్తున్నారు. జర్నలిస్టులను కూడా కేసులు పెట్టి బంధిస్తున్నారని మండిపడ్డారు.

## ఎల్‌నినో సవాళ్లు..



**(మొదటి పేజీ తరువాయి)**
లోటు వర్షపాతం, కరవు ప్రభావంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సినిమా, మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని ఆదేశించారు. దసరా పండుగ ముగిసిన తర్వాత గ్రామాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**రైతాంగానికి సాయం**
రైతులు సాగు చేసిన పంటలు చేతికి వచ్చే వరకు ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా పర్యవేక్షించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని ఇప్పటికే విజ్ఞప్తి చేశామని చెప్పారు. ఉపాధి హామీ పథకం (జీరాంజీ) కింద ప్రస్తుతం ఉన్న 125 రోజులకు అదనంగా మరో 50 రోజుల పనిదినాలను పెంచాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించడానికి ప్రత్యేక వార్ రూమ్, టోల్ ఫ్రీ నం. ఏర్పాటు చేయాలన్నారు.

**రాబోయే సమావేశాల్లో**
ఎల్‌నినో, కరవు పరిస్థితులపై చర్చించేందుకు 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అనంతరం మధ్యాహ్నం రైతువేదికల ద్వారా ప్రత్యక్షంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రైతులతో మాట్లాడనున్నట్లు స్పష్టం చేశారు.

## ఢిల్లీలో సీజేపీ నేతల విడుదల

**ముద్ర డెస్క్:**
భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)కి వ్యతిరేకంగా నిరసనలకు సిద్ధమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేతలను ఢిల్లీ పోలీసులు విడుదల చేశారు. ఏడాది పాటు శాంతియుతంగా, మంచి ప్రవర్తనతో మెలగాలనే షరతుపై వారిని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు. రూ.50,000 పూచీకత్తుతో కూడిన బెయిల్ బాండ్‌పై వారిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. సీజేపీ నేతలు అభిజీత్ డిప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు కోర్టు షరతులతో కూడిన విడుదల మంజూరు చేసిందని ఆ పార్టీ న్యాయవిభాగం అధిపతి రత్న సింగ్ ధ్రువీకరించారు. శనివారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగుపెట్టగానే, ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా, ఈ మేరకు ఆదేశాలు వెలువడ్డాయి.
చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ, ప్రతిపక్షాలు శనివారం ఢిల్లీలో భారీ నిరసనకు పిలుపునిచ్చాయి. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)లో అవకతవకలు జరిగాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ నిరసనకు అనుమతి నిరాకరించిన పోలీసులు, ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. జంతర్ మంతర్ వద్ద జులైలో జరిగిన నిరసన హింసాత్మకంగా మారిన నేపథ్యంలో ఈసారి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇంటర్నెట్ సేవలను పరిమితం చేసి, ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.
పోలీసుల హెచ్చరికలను కాదని నిరసనలకు ప్రయత్నించిన సుమారు 3000 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ వంటి ప్రముఖ ప్రతిపక్ష నేతలు కూడా ఉన్నారు. నిర్బంధించిన వారిని ఛత్రసాల్ స్టేడియం, ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించి, సాయంత్రానికి విడుదల చేశారు. ఈ ఘటనలకు సంబంధించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై 20కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు.

## తహశీల్దార్ సస్పెన్షన్

ముద్ర, మెదక్:
సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహశీల్దార్ చిట్టంపల్లి స్వామిపై సస్పెన్షన్ వేటుపడింది. ఇటీవల ఓ రైతును ఉద్దేశించి తహశీల్దార్ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ''నువ్వింకా బతికే ఉన్నావా? పురుగుల మందు తాగలేదా?'' అని మాట్లాడినట్లుగా ఉన్న వీడియో వైరలయింది. దీంతో తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలంటూ.. రైతులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఆర్డీవో ప్రాథమిక నివేదిక ఆధారంగా తహసీల్దార్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఆదేశించారు.



## ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ పేరుతో భారీగా ఓట్లు తొలగిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. ఓటర్ల తొలగింపుపై ప్రశ్నిస్తున్న వారిని అరెస్టులు చేయడం, అవమానించడం తగదన్నారు. ఈ విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు బహిరంగ సవాల్ విసిరారు.

**బాధితులను మీ ముందే నిలబెడతాం**
'ఓటు హక్కు కోల్పోయిన వారు ఎవరైనా ఉన్నారా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ప్రశ్నించడం సరికాదు. పోలీసులతో అరెస్టులు చేయించడం కాకుండా ఆయన తేదీ, సమయం ప్రకటిస్తే ఓటు హక్కు కోల్పోయి ఆందోళన చెందుతున్న బాధితులను ఆధారాలతో సహా ఆయన ముందుకు తీసుకొస్తాన'ని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో జరిగిన పొరపాట్లపై బాధితులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీపై ఉందన్నారు.

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఓట్లపై కుట్ర**
ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదని మంత్రి ఆరోపించారు. దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లు, హైదరాబాద్‌లోనే 40 లక్షలు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సవరణ పేరుతో 70 లక్షల ఓట్లు తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. రోజువారీ కూలీలు, నిరక్షరాస్యులు, వృద్ధులు ఆధార్ కార్డులు ఉన్నప్పటికీ తమ ఓటు హక్కును నిరూపించుకోవడానికి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. తన సొంత ఓటు విషయంలోనూ తండ్రి పేరు (సత్తయ్య / సత్యనారాయణ గౌడ్) తేడా సాకుగా చూపి తొలగించే ప్రయత్నం జరిగిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సైతం గతంలో ఓటరు నమోదు, ఆధారాల సమర్పణపై ఎదురైన ఇబ్బందులను ప్రస్తావించారని, సామాన్యుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు.

**ఓటు బచావో - దేశ్ బచావో**
స్వాతంత్ర్యం వచ్చిన 80 ఏళ్ల తర్వాత ప్రజలు తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కాపాడుకోవడానికి పోరాడాల్సిన పరిస్థితి రావడం విచారకరమని మంత్రి పొన్నం అన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోకూడదని డిమాండ్ చేస్తూ, 'ఓటు బచావో – దేశ్ బచావో.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం' నినాదంతో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు

## కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ!

**(మొదటి పేజీ తరువాయి)**
వివరాలను కిషన్ రెడ్డి ఎక్స్‌లో వెల్లడించారు. మరోవైపు, హైస్పీడ్ రైల్ కారిడార్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు సిద్ధమవుతోందంటూ బీఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. దీంతో కేంద్రం ప్రకటన రాష్ట్ర ప్రభుత్వానికి రాజకీయంగా కొత్త ప్రశ్నలను తెచ్చింది.



**రేవంత్ సర్కార్ ఏం చెబుతుంది?**
అలైన్‌మెంట్లు ఖరారు కాకముందే భూముల గుర్తింపు, మార్కింగ్‌లు, భూసేకరణకు సంబంధించి చర్యలు చేపట్టారా? బహదూర్‌గూడలో భూముల కేటాయింపుపై వస్తున్న ప్రశ్నలకు ప్రభుత్వం ఎలాంటి వివరణ ఇస్తుంది? రైతుల ఆందోళనలకు సంబంధించి ఏ చర్యలు తీసుకుంటుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.

**ఎన్నికల వేళ కీలక అంశం!**
తెలంగాణలో అధికారాన్ని విస్తరించడంపై కాంగ్రెస్, బీజేపీ రెండూ దృష్టి సారిస్తున్నాయి. త్వరలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హైస్పీడ్ రైల్ కారిడార్ల అంశం రాజకీయ చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. కేంద్రం ప్రకటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందన, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే వివరణ, బీజేపీ తదుపరి కార్యాచరణ ఎలా ఉంటాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## తెగిపడిన లిఫ్ట్

**ముద్ర, కరీంనగర్ :**
మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఓ బాంకెట్ హాల్ ప్రారంభోత్సవానికి వెళ్లిన ఆయన ఎక్కిన లిఫ్ట్ ఒక్కసారిగా తెగిపడింది. స్వల్ప ఎత్తు నుంచే లిఫ్ట్ పడటంతో మంత్రి సురక్షితంగా బయటపడ్డారు. దీంతో అక్కడున్నవారు ఊపిరి పీల్చుకున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ గతంలోనూ లిఫ్ట్ ప్రమాదానికి గురైనట్లు ప్రచారం ఉంది. తాజాగా మరోసారి ఆయన లిఫ్ట్ ప్రమాదం నుంచి బయటపడటం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు బయటకు రాకుండా కఠిన ఆదేశాలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.



## చెన్నైకి కొత్త మెట్రో

ముద్ర, డెస్క్:
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం చెన్నైలో పర్యటిస్తోన్నారు. ఈ ఉదయం ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకి చేరుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి విజయ్.. సాదరంగా ఆయనను ఆహ్వానించారు. తన పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ 13,000 కోట్ల రూపాయలకు పైగా విలువ చేసే అనేక కీలక ప్రాజెక్టులకు ప్రారంభించారు. కొన్నింటికి శంకుస్థాపనలు చేశారు. వీటిల్లో మెట్రో రైల్ ఫేస్ 2 విస్తరణ, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడం, నగరాభివృద్ధిని వేగవంతం చేయడం వంటివి ఉన్నాయి.
ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో విజయ్ మాట్లాడారు. పలు ప్రతిపాదనలను ప్రధాని ముందు ఉంచారు. రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల విడుదలలో వేగం పెంచాలని కోరారు. చెన్నై మెట్రో రైల్ మూడో దశ విస్తరణకు తక్షణ ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు గోదావరి– కావేరి నదుల అనుసంధానం, సమగ్ర శిక్షా అభియాన్ కింద రావాల్సిన నిధుల విడుదల తదితర ప్రతిపాదనలను ఆమోదించాలని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఆయా ప్రాజెక్టులు కీలకమని స్పష్టం చేశారు.
చెన్నైలో ట్రాఫిక్ సమస్యలను నివారించడానికి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడానికి చెన్నై మెట్రో ఫేజ్– 3 ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని విజయ్ వివరించారు. ఇందులో భాగంగా తాంబరం ఎయిర్ పోర్ట్ నుండి కీలంబాక్కం, పూనమల్లి– సుంగువార్‌ఛత్రం వరకు మెట్రో మార్గాలను విస్తరించాలని అన్నారు. కర్ణాటక సరిహద్దులకు ఆనుకుని ఉన్న హోసూర్ నుండి బెంగళూరులోని బొమ్మసంద్ర 20 కిలో మీటర్ల అంతర్రాష్ట్ర మెట్రో కారిడార్‌ను నిర్మించాలని విజయ్.. ప్రధానికి విన్నవించారు.
చెన్నై మెట్రో రెండవ దశలో భాగమైన పూనమల్లి– వడపళని రూట్ ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూనే రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల మెట్రో ప్రాజెక్టులపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కోయంబత్తూర్, మదురైల్లో మెట్రో రైల్ ప్రాజెక్టులను పునఃపరిశీలించి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఆయా నగరాల్లో రోజురోజుకూ పెరుగుతున్న వాహన రద్దీ దృష్ట్యా మెట్రో రైల్ ను అందుబాటులోకి తీసుకుని రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
రైల్వే, రహదారుల అభివృద్ధికి సంబంధించి పలు విజ్ఞప్తులు చేశారాయన. బడ్జెట్‌లో ప్రకటించిన ఉమ్మడి హైస్పీడ్ రైల్ కారిడార్ల ప్రణాళికలో భాగంగా చెన్నై– కన్యాకుమారి, చెన్నై– కోయంబత్తూర్ వరకు నూతన హైస్పీడ్ కారిడార్లను మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే.. రాష్ట్ర పరిధిలోని ప్రధాన జాతీయ రహదారులను 6– లేన్ గా విస్తరించే పనులను వేగవంతం చేయాలని అన్నారు.
గోదావరి–కావేరి నదుల అనుసంధానం అత్యవసరమని ఈ సందర్భంగా విజయ్ తేల్చి చెప్పారు. దీన్ని జాతీయ ప్రాజెక్ట్ గా గుర్తించాలని కోరారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య నీటి పంపిణీలో సమతుల్యత సాధించడానికి, తాగునీరు, సాగునీటి కొరతను అధిగమించడానికి ఈ నదుల అనుసంధానం ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమిళనాడుతో పాటు పొరుగు రాష్ట్రాల రైతులకు కూడా విస్తృత ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.




## పట్టణ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు

**ముద్ర, అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో బీసీ రిజర్వేషన్లను ఖరారు చేస్తూ కూటమి ప్రభుత్వం శనివారం నూతన మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించే మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని ఈ జీవోలో స్పష్టంగా పేర్కొంది. సుప్రీంకోర్టు, ఏపీ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులకు అనుగుణంగా ఈ నిబంధనను తప్పనిసరి చేసింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ జీవో ఎంఎస్ నంబర్–251ను విడుదల చేశారు. రిజర్వేషన్ల ఖరారు కోసం సుప్రీంకోర్టు నిర్దేశించిన 'ట్రిపుల్ టెస్ట్' విధానాన్ని ప్రభుత్వం కచ్చితంగా పాటించింది. దీని కోసం గతంలో ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన సిఫార్సులకు ఆమోదం తెలిపింది. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ డేటా ఆధారంగా పట్టణ ప్రాంతాల్లో బీసీల జనాభాను గుర్తించి, వారి రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఈ రిజర్వేషన్లను కేటాయించినట్లు ప్రభుత్వం వివరించింది. రిజర్వేషన్ల కేటాయింపులో మొదట ఎస్టీలకు, ఆ తర్వాత ఎస్సీలకు, చివరగా బీసీలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.
మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల స్థానాలకు రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు వర్తింపజేయనున్నారు. 2021లో అమలు చేసిన రిజర్వేషన్ సర్కిల్‌ను ఆధారంగా తీసుకుని తదుపరి రిజర్వేషన్లను ఖరారు చేయాలని ఆదేశించారు. అయితే, పునర్విభజన జరిగిన వార్డులలో మాత్రం రిజర్వేషన్ల సైకిల్ కొత్తగా ప్రారంభమవుతుందని జీవోలో పేర్కొన్నారు.
గతంలో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోను హైకోర్టు నిలిపివేసిన నేపథ్యంలో, న్యాయపరమైన చిక్కులు లేకుండా తాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్గదర్శకాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

## జిబూటి తీరంలో పడవ బోల్తా

**ముద్ర, న్యూఢిల్లీ :**
ఆఫ్రికా దేశమైన జిబూటి తీరంలో పడవ మునిగిపోయిన ఘటనలో 109 మంది వలసదారులు మృతి చెందారు. మరణించిన వారిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతయినట్లు అంతర్జాతీయ వలసల సంస్థ (IOM) ప్రకటించింది. ప్రమాద సమయంలో పడవలో దాదాపు 350 మంది ఉన్నట్లు సమాచారం. జిబూటి నుంచి యెమెన్‌కు వెళ్తుండగా.. గుహెరే ప్రాంతానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 80 మందికిపైగా ఇథియోపియా పౌరులు ప్రాణాలతో బయటపడినట్లు తెలుస్తోంది. అధికారులు ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. ఉపాధి అవకాశాలు, భద్రత కోసం గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో ఏటా వేలాది మంది వలసదారులు జిబూటి మీదుగా ప్రయాణించి.. ప్రమాదకర పరిస్థితుల్లో బాబ్ ఎల్ మండెబ్ జలసంధిని దాటి, యెమెన్‌కు వెళ్తుంటారు. ఐఓఎం వివరాల ప్రకారం.. 2025లో ఈ మార్గంలో 900 మందికిపైగా వలసదారులుగల్లంతయ్యారు.

కలియుగ వైకుంఠం తిరుమలలో అక్టోబర్ 12 నుంచి 20 వరకు అంగరంగ వైభవంగా జరగనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సేనాధిపతి విశ్వక్సేనుడు ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టం నిర్వహించారు. **–ముద్ర, తిరుమల:**



సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

సోమవారం 12.10.2026

www.mudranews.in | @mudranews



### కరువు ముప్పు.. ప్రతి నీటి చుక్కను పొదుపు చేయండి!

ఎల్‌నినో కారణంగా వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున నీటి వినియోగంలో జాగ్రత్తలు అవసరం. కుళాయిలు లీక్ కాకుండా చూసుకోవాలి. వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి అవస రాలకు వీలైనంత వరకు వాడిన నీటిని పున ర్వినియోగించాలి. నీటి వృథాను అరికట్టడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను కొంతవరకు తగ్గించవచ్చు.



## గోవా-హైదరాబాద్ డ్రగ్స్ సరఫరా.. నిందితుడి అరెస్టు



ముద్ర, హైదరాబాద్ : గోవా–హైదరాబాద్ డ్రగ్స్ సరఫరా నెట్ వర్క్ పై ఈగల్ , హైదరాబాద్ సిటీ పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడు కస్టోడియో ఫెర్నాండెస్ అలియాస్ క్రిస్టీని గోవాలో అరెస్టు చేశారు. పంజాగుట్ట డ్రగ్స్ దర్యాప్తు కేసులో గోవా లింకులు వెలుగులోకి రావడంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. గోవాలో నిందితుడు ఉన్నట్లు సమాచారం తెలుసుకొని పక్కా ప్లాన్ ప్రకారం అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో తెలంగాణకు చెందిన 25 మందికిపైగా వ్యక్తుల వివరాలు సేకరించారు.

మొబైల్ ఫోన్ డేటా, బ్యాంకు లావాదేవీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ కు చెందిన పలువురి పేర్లు, ఫోన్ నంబర్లను నిందితుడి మొబైల్ లో గుర్తించారు. గోవా నుంచి హైదరాబాద్ కు వచ్చి, డ్రగ్స్ సరఫరా చేసి, నగదు వసూలు చేసినట్లు అనుమానిస్తున్న వ్యక్తులపైనా విచారణ చేపట్టారు. గోవా, బెంగళూరు, ముంబయి, దిల్లీ తదితర ప్రాంతాల్లోని డ్రగ్స్ కొనుగోలుదారులు, అనుమానిత సరఫరాదారులపై అధికారులు నిఘా పెట్టి, వివరాలు సేకరిస్తున్నారు. గతంలో పంజాగుట్ట పోలీసులు 13 గ్రాముల ఎండీఎంఏ, 7 గ్రాముల చరస్ స్వాధీనం చేసుకున్నారు.

## రూ.20 లక్షల కోసం చిన్నారి అపహరణ.. ఆపై దారుణ హత్య

ముద్ర, హైదరాబాద్ : సికింద్రాబాద్‌లోని కౌకూర్‌లో అపహరణకు గురైన ఆరేళ్ల చిన్నారి హత్య కలకలం రేపింది. ఆడుకుంటూ కనిపించకుండా పోయిన చిన్నారి మోజెస్ అరులియా.. సమీప క్లబ్ హౌస్‌లో ఉన్న సంపులో విగతజీవిగా కనిపించింది. కిడ్నాప్ చేసిన దుండగుడు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేయడం, ఆపై కాళ్లు, చేతులు కట్టేసిన స్థితిలో మృతదేహం లభించడం అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారిని చంపాడని ఆరోపణలు ఎదుర్కొంటూ, పరారీలో ఉన్న వాచ్‌మెన్ విక్రమ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## శంషాబాద్‌లో ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

**ముద్ర, శంషాబాద్:** దిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. ఓ ప్రయాణికుడికి చెందిన పవర్‌బ్యాంక్‌లో మంటలు వచ్చాయి. విమాన సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలు ఆర్పివేశారు. విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు.

## హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుండటం, పండుగ సెలవుల దృష్ట్యా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో వాహనాలు బారులు తీరాయి.

## ఢిల్లీ ప్రెస్ క్లబ్‌లో పోలీసుల దురుసు ప్రవర్తనను ఖండించిన ఐజేయూ

*** సుమోటోగా విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి**

**ముద్ర, విజయవాడ / చండీగఢ్ :** ఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో పోలీసుల చర్యలను ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన పత్రికా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి అని అభివర్ణించింది. పోలీసులు, భద్రతా సిబ్బంది ప్రెస్ క్లబ్‌లోకి బలవంతంగా ప్రవేశించి జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించారని, నిరసనకారులతో పాటు పలువురు జర్నలిస్టులను అదుపులోకి తీసుకుని తెలియని ప్రాంతాలకు తరలించారని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ, ప్రధాన కార్యదర్శి డి. సోమసుందర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆరోపించారు. ప్రెస్ క్లబ్‌ను చుట్టుముట్టి గేట్లు మూసివేయడంతో పాటు బయట ఉన్న జర్నలిస్టులను బెదిరించారని పేర్కొన్నారు.

1975లో విధించిన ఎమర్జెన్సీ సమయంలో కూడా ఇలాంటి సంఘటనలు జరగలేదని వారు వ్యాఖ్యానించారు. జర్నలిస్టులపై జరిగిన ఈ ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి, నిష్పాక్షిక విచారణకు ఆదేశించడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

IJU Indian Journalists Union

# గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయం..

**2027లో అధికారంలోకి వస్తాం: సీఎం రేవంత్ రెడ్డి**
**గోవా: బీజేపీపై తీవ్ర విమర్శలు.. డ్రగ్స్, భూ మాఫియాకు ప్రభుత్వమే అండగా ఉందని ఆరోపణలు**



**ముద్ర, హైదరాబాద్ :** గోవాలో 2027లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గోవాలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతినిధిగా తాను గోవాకు వచ్చానని వెల్లడించారు. ఢిల్లీలో నిరసన కార్యక్రమాల నేపథ్యంలో రాహుల్ గాంధీ గోవా పర్యటనకు రాలేకపోయారని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనను ఆయన ప్రతినిధిగా పంపించారని తెలిపారు.

**బీజేపీ పాలనపై విమర్శలు**

గోవా ప్రజలు బీజేపీ పాలనతో విసిగిపోయారని రేవంత్ రెడ్డి అన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే స్థానిక ప్రజలు తమ సొంత రాష్ట్రంలోనే పరాయివారిగా మారే పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. గోవాలో భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ రాష్ట్ర అభివృద్ధి కంటే ఆస్తులను ఇతరులకు అప్పగించడంపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు. అందుకే స్థానికులు ఆయనను 'ప్రాపర్టీ సావంత్' అని పిలుస్తున్నారని పేర్కొన్నారు.

**డ్రగ్స్‌కు అడ్డాగా గోవా మారింది**

బీజేపీ పాలనలో గోవా డ్రగ్స్‌కు కేంద్రంగా మారిపోయిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర యువత మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'నషా ముక్త్ భారత్' గురించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గోవాలో డ్రగ్స్ సమస్యను ఎందుకు అరికట్టడం లేదని ప్రశ్నించారు. డ్రగ్స్ ముఠాలు, భూ మాఫియా రాష్ట్రంలో రాజ్యమేలాలా? అని ప్రజలను నిలదీశారు. గోవా యువత భవిష్యత్తును కాపాడటంతో పాటు రాష్ట్ర ప్రతిష్ఠను నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

**ఓట్ల తొలగింపుపై ఆరోపణలు**

జ్ఞానేశ్ కుమార్ పేరుతో పేదల ఓట్లను తొలగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీకి అనుకూలంగా పనిచేసే సంస్థల ద్వారా ప్రయోజనం పొందే పరిస్థితి తగ్గిపోవడంతో ఇప్పుడు ఓట్ల తొలగింపుపై దృష్టి పెట్టారని విమర్శించారు.

**రావణాసురుడు బీజేపీ.. రాముడు కాంగ్రెస్**

గోవాలో జరుగుతున్న రాజకీయ పోరాటాన్ని రావణాసురుడు, రాముడి మధ్య యుద్ధంతో రేవంత్ రెడ్డి పోల్చారు. బీజేపీని రావణుడిగా, కాంగ్రెస్‌ను రాముడిగా అభివర్ణించారు. రావణుడిని ఓడించాలంటే ప్రజలంతా రాముడికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. గోవాలో కాంగ్రెస్‌కు కాకుండా ఇతర పార్టీలకు ఓటు వేస్తే ఆ ఓట్లు చివరకు బీజేపీకే ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు.

**భారత్ జోడో యాత్రతో దేశాన్ని ఏకం చేసే ప్రయత్నం**

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలను ఏకం చేసేందుకు ప్రయత్నించారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అయితే ప్రధాని మోదీ ప్రజల మధ్య విభజన సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం కాంగ్రెస్ పార్టీ కోసం కాదని, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు.

2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం

రుతుపవనాలు తొలుత కేరళలో ప్రవేశించి, ఆ తర్వాత గోవాకు చేరుకుంటాయని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. 2026లో కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, 2027 రుతుపవనాల సమయంలో గోవాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గోవా నుంచి ప్రారంభమయ్యే కాంగ్రెస్ రాజకీయ విజయ పరంపర ఢిల్లీ ఎర్రకోటపై త్రివర్ణ పతాకం ఎగరేసే దిశగా సాగుతుందని వ్యాఖ్యానించారు.

రెండుసార్లు బీజేపీని నమ్మి మోసపోయారని ఆరోపించిన రేవంత్ రెడ్డి, గోవా ప్రజలు మూడోసారి ఆ పార్టీని నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

# తెలంగాణలో కరువు ముప్పు..

**రెండో పంట వేయొద్దంటూ మంత్రి కీలక విజ్ఞప్తి**
**తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో కరువు ముప్పు**
**రెండో పంట వేయొద్దంటూ రైతులకు మంత్రి విజ్ఞప్తి**
**యూనిట్ రూ.15 పెట్టినా దొరకని విద్యుత్**
**నీటి ఎద్దడిపై ప్రత్యేక కేబినెట్ భేటీ**

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో రానున్న కాలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న 'ఎల్‌నినో' (El Nino) పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో సాగు నీటితో పాటు రాబోయే రోజుల్లో తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న మొదటి పంటను ఎలాగైనా కష్టపడి వంద శాతం కాపాడుకుంటామని, అయితే రైతులు ఎవరూ కూడా దయచేసి రెండో పంట (యాసంగి/వేసంగి) వేయవద్దని ఆయన ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు.



**విద్యుత్ కొనుగోలు భారంగా మారింది..**

రాష్ట్రంలో తలెత్తబోయే విద్యుత్ సంక్షోభం, కరెంటు ఇబ్బట్లపై మంత్రి పొంగులేటి స్పష్టతనిచ్చారు. పవర్ గ్రిడ్‌లో డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్ సరఫరా చేయడం కష్టంగా మారుతోందని, విద్యుత్‌ను బయటి మార్కెట్ నుంచి కొనుగోలు చేయాలంటే యూనిట్‌కు రూ. 15 వెచ్చించినా దొరకని దయనీయ పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల ప్రజలందరూ కూడా విద్యుత్‌ను అత్యంత పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఒకవేళ రైతులు ఎవరైనా రెండో పంట వేస్తే.. అటు ప్రభుత్వం నీటిని, విద్యుత్‌ను సరఫరా చేయలేక సతమతమవుతుందని, ఇటు రైతులు తీవ్రంగా నష్టపోయి ఆర్థికంగా బాధపడాల్సి వస్తుందని ఆయన హితవు పలికారు. రైతులు ఈ పరిస్థితులను అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

**రేపు, ఎల్లుండి కేబినెట్ భేటీ.. కేంద్రం పాత్రపై చర్చ**

వర్షాభావ పరిస్థితులు, తాగు–సాగు నీటి ఎద్దడి, విద్యుత్ కొరతను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలో చర్చించేందుకు రేపు, ఎల్లుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్గ ప్రత్యేక సమావేశం జరగనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కేబినెట్ భేటీలో సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ చర్యలపై చర్చిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి కరువు నివారణకు, రాష్ట్రానికి అండగా నిలవాలని ఈ సమావేశంలో తీర్మానించి విజ్ఞప్తి చేస్తామన్నారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీల నేతలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, ఎల్‌నినో ప్రభావంపై వారి నుంచి విలువైన సలహాలు, సూచనలు స్వీకరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## లలిత కళా తోరణంలో అటుకుల బతుకమ్మ వేడుకలు



**ముద్ర, హైదరాబాద్,** : తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని లలిత కళా తోరణంలో అక్టోబర్ 11, 2026న అటుకుల బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, పుష్ప సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.

తెలంగాణకు ప్రతిష్టాత్మకమైన పుష్ప పండుగ అయిన బతుకమ్మ విశిష్టతను ఈ వేడుకలు చాటిచెప్పాయి. బతుకమ్మ తెలంగాణ సమృద్ధమైన సాంస్కృతిక సంప్రదాయాలకు, మహిళా శక్తికి, ప్రజలకు–ప్రకృతికి మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది.

ఈ సందర్భంగా తెలంగాణ సంప్రదాయ కళారూపాలను ప్రతిబింబించే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు ప్రదర్శించిన మనోహరమైన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నృత్యంలోని హావభావాలు, సొగసైన కదలికలు భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించాయి. అదేవిధంగా సంప్రదాయ డప్పుల ప్రదర్శనలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని, పండుగ శోభను తీసుకొచ్చాయి.

అటుకుల బతుకమ్మ వేడుకలు తెలంగాణకు చెందిన స్థానిక సంప్రదాయాలు, జానపద కళలు, శాస్త్రీయ నృత్యాలు మరియు సాంస్కృతిక గుర్తింపును ప్రోత్సహించేందుకు ఒక వేదికగా నిలిచాయి. ఇటువంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర సమృద్ధమైన అమూర్త సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడం, అలాగే తెలంగాణ వైభవమైన పండుగలను పర్యాటకులు, ప్రజలకు పరిచయం చేయడం తెలంగాణ పర్యాటక శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
సోమవారం, 12 అక్టోబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

## యూరిక్ యాసిడ్ లెవల్స్

# ఎంత ఉండాలి?

గౌట్ అనేది కాలి బొటనవేలులో వచ్చే సమస్య. ఎప్పుడైతే మన రక్తంలో యూరిక్ యాసిడ్ లెవల్స్ ఎక్కువగా పెరుగుతాయో కీళ్లలో స్ఫటికాలు ఏర్పడతాయి. దీంతో విపరీతంగా నొప్పి, వాపు ఉంటుంది. ఈ ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్ సమస్యనే గౌట్ అంటారు. ఈ సమస్యతో చాలా మంది బాధపడుతుంటారు. అయితే, తాజాగా ఈ సమస్య గురించి కొన్ని ముఖ్య వార్తలొస్తున్నాయి. సమస్య వస్తే కీళ్లకే పరిమితం కాకుండా గుండె సమస్యలు, గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలకి కూడా కారణమవుతుందట.




కీళ్లకి వచ్చే గౌట్ సమస్యతో చాలా మంది బాధపడుతుంటారు. రక్తంలో పెరిగిన యూరిక్ యాసిడ్ కారణంగా సమస్య వస్తుంది. దీంతో దానిని తగ్గించుకునేందుకు రకరకాల చిట్కాలు, ట్రీట్‌మెంట్ తీసుకుంటారు. ఎందుకంటే వ్యాధి తీవ్రత అంత దారుణంగా ఉంటుంది. ఇది ముఖ్యంగా కాలి బొటనవేలులో వచ్చి ఎర్రగా మారి నొప్పి వాపుని కలిగిస్తుంది. దీంతో విలవిల్లాడిపోతారు. ఇక చల్లని వాతావరణంలో సమస్య పెరుగుతుంది. వర్షాకాలం ముఖ్యంగా చలికాలంలో అయితే యూరిక్ యాసిడ్, గౌట్, ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడేవారు నొప్పులతో విలవిల్లాడిపోతారు. అయితే, ఇది ఆ కీళ్ళవాతంతోనే ఆగిపోదు. గౌట్ సమస్యలు ఉన్నవారికి గుండెపోటు, పక్షవాతంతో సహా గుండె సంబంధ సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు డాక్టర్లు మరి సమస్య పెరిగి ప్రమాదంగా మారకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోండి.

రక్తంలో యూరిక్ యాసిడ్ పెరిగి కీళ్లలో సూది ఆకారంలో స్ఫటికాలుగా ఏర్పడి గౌట్ వస్తుంది. యూరిక్ యాసిడ్ పెరగడం, గౌట్‌తో సంబంధం ఉన్న వాపు అనేవి రక్తనాళాల పనితీరులో లోపం, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదంతో కూడా ముడిపడి ఉండొచ్చని చెబుతున్నారు డాక్టర్. అయితే, ఈ సంబంధం గురించి అన్ని విధాలుగా ఆలోచించాలి. కేవలం యూరిక్ యాసిడ్ పెరిగినంత మాత్రాన ఓ వ్యక్తికి గుండె సమస్యలొస్తాయని చెప్పలేమని కూడా డాక్టర్ చెబుతున్నారు. గౌట్, గుండె సంబంధ సమస్యల మధ్య సంబంధానికి ముఖ్య కారణం గౌట్ అనేది హైబీపీ, ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి, అసాధారణ కొలెస్ట్రాల్ స్థాయిలతో సహా హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని పెంచే పరిస్థితులకి కారణమవుతుంది. ఇవి యూరిక్ యాసిడ్ లెవల్స్‌ని ఎఫెక్ట్ చేసి గుండె, రక్తనాళాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తాయి. గౌట్ సమస్య తగ్గించుకునేందుకుయూరిక్ యాసిడ్ లెవల్స్, కిడ్నీల పనితీరు, రక్త పోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్‌ల గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. అవసరమై తే మెడిసిన్ తీసుకోవడం వల్ల సమస్య తగ్గడంలో హెల్ప్ అవుతుంది. అయితే, ఇది డాక్టర్ సలహాతోనే తీసుకోవాలి. కీళ్లలో నొప్పి లేదని మెడిసిన్ ఆపొద్దు.

### ట్రీట్‌మెంట్‌తో గుండె సమస్యని తగ్గించలేం

ఇక్కడ యూరిక్ యాసిడ్‌ని కంట్రోల్ చేయడానికి తీసుకునే ట్రీట్‌మెంట్‌తో గుండెపోటుని కంట్రోల్ చేయొచ్చని అనుకోవద్దు. ఎందుకంటే యూరిక్ యాసిడ్, గుండె సమస్యల మధ్య సంబంధం గురించి పరిశోధనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాబట్టి, ఎప్పుడు కూడా ఏదైనా సమస్య ఉంటే ముందుగా డాక్టర్‌ని కలిసి సరైన నివారణ చర్యలు తీసుకోవాలి.

### మంచి లైఫ్‌స్టైల్ కూడా ముఖ్యమే

యూరిక్ యాసిడ్, గౌట్ వీటి కారణంగా వచ్చే సమస్యల్ని తగ్గించుకునేందుకు సరైన లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వడం కూడా ముఖ్యమే. హెల్దీ వెయిట్ మెంటెయిన్ చేయాలి. రెగ్యులర్ వర్కౌట్, ఆల్కహాల్‌ని తగ్గించడం, షుగర్ డ్రింక్స్ తగ్గించడం, బ్యాలెన్స్డ్ డైట్ వంటివి జీవక్రియని పెంచి గుండె సంబంధ సమస్యలు రాకుండా చేస్తాయి. గౌట్ సమస్యతో బాధపడేవారు కేవలం నొప్పికి ట్రీట్‌మెంట్ తీసుకుంటే బాడీలోపల వచ్చే ప్రమాదకర సమస్యలు కూడా తగ్గుతాయనుకోవద్దు. గౌట్ సమస్యని గుండె సంబంధ, జీవక్రియ సమస్యలు రావడానికి ఓ కారణంగా గుర్తించి సమస్యలు రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. సమయం తెలుగు సంప్రదించిన వైద్య నిపుణులు

---

## మైగ్రేన్‌కు చెక్ పెట్టే

# హెర్బల్ డ్రింక్!

ఆయుర్వేద నిపుణుల ప్రకారం, సహజ మూలికల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్త నాళాల్లో వాపును తగ్గించి, మెదడుకు సక్రమంగా రక్త ప్రసరణ జరిగేలా చేస్తాయి. దీనివల్ల తలనొప్పి తీవ్రత క్రమంగా తగ్గుతుంది.

హెర్బల్ డ్రింక్ తయారీకి కావలసిన పదార్థాలు ఒక చిన్న అల్లం తురుము. ఇది నొప్పులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. గుప్పెడు తాజా పుదీనా ఆకులు. మనసుకు ప్రశాంతతను ఇస్తాయి. చిటికెడు దాల్చినచెక్క పొడి. రుచికి తగినట్లుగా కొద్దిగా తేనె ఇది మీ ఆప్షనల్.

ఇక తయారు చేసే విధానంలోకి వెళ్తే.. ఒక గిన్నెలో ఒకటిన్నర గ్లాసు నీటిని తీసుకోవాలి. అందులో అల్లం తురుము, పుదీనా ఆకులు వేసి బాగా మరిగించాలి. నీరు సగానికి తగ్గిన తర్వాత దాల్చినచెక్క పొడిని కలపాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని వడకట్టి, గోరువెచ్చగా ఉన్నప్పుడు కొద్దిగా తేనె కలుపుకొని త్రాగాలి.

### ఈ డ్రింక్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు

ఈ హెర్బల్ టీని రోజూ ఉదయం పరగడుపున లేదా మైగ్రేన్ నొప్పి ప్రారంభమవుతుంది అనిపించినప్పుడు త్రాగితే తక్షణ ఉపశమనం లభిస్తుంది. ఇది నాడీ వ్యవస్థను రిలాక్స్ చేసి ఒత్తిడిని దూరం చేస్తుంది. అయితే, సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు నిపుణుల సలహా తీసుకోవడం ఎల్లప్పుడూ మంచిది.

---

# డయాబెటిస్‌కు స్వీట్లే కారణమా?

డయాబెటిస్‌ను దూరంగా ఉంచుకోవాలంటే కేవలం తీపి పదార్థాలను తగ్గించడం ఒక్కటే సరిపోదు. మనం ప్రతి రోజూ చేసే చిన్న చిన్న అలవాట్లను కూడా గమనించాలి. కొన్ని అధ్యయనాల్లో అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, బ్రేక్‌ఫాస్ట్‌ను తరచూ మానేయడం, పొగతాగడం వంటి అలవాట్లకు టైప్-2 డయాబెటిస్ ముప్పుతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు.



### ప్యాక్‌డ్ ఫుడ్ ఎక్కువగా తింటున్నారా?

ప్యాకెట్‌లో దొరికే ప్రతి ఆహారం ఒకేలా ఉండదు. అయితే అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను ఎక్కువగా తీసుకోవడం టైప్-2 డయాబెటిస్ ముప్పుతో సంబంధం ఉన్నట్లు పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇటీవలి మెటా-అనాలిసిస్‌లలో అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్ తీసుకునే పరిమాణం పెరిగే కొద్దీ డయాబెటిస్ ప్రమాదం కూడా పెరిగినట్లు గుర్తించారు. అందుకే తరచూ ప్యాకెట్ స్నాక్స్, చక్కెర కలిగిన పానీయాలు, అధికంగా ప్రాసెస్ చేసిన మాంసాహారం, రెడీ-టు-ఈట్ ఆహారాలపై ఆధారపడకుండా.. వీలైనంత వరకు తాజా, తక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాలకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది.

### ఉదయం టిఫిన్‌ను స్కిప్ చేస్తున్నారా?

బరువు తగ్గాలనే ఉద్దేశంతో లేదా బిజీ షెడ్యూల్ కారణంగా చాలామంది ఉదయం అల్పాహారాన్ని మానేస్తుంటారు. బ్రేక్‌ఫాస్ట్‌ను తరచూ మానేయడం, టైప్-2 డయాబెటిస్ ముప్పు మధ్య సంబంధం ఉందని పరిశోధనలు సూచించాయి. ఒక మెటా-అనాలిసిస్‌లో బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేసేవారిలో డయాబెటిస్ ప్రమాదం ఎక్కువగా కనిపించింది. అయితే ఇది పరిశీలనా ఆధారిత సంబంధం మాత్రమే.. టిఫిన్ మానేయడం ఒక్కటే డయాబెటిస్‌కు ప్రత్యక్ష కారణమని నిర్ధారించలేం. అందుకే ఉదయం తినే ఆహారాన్ని పూర్తిగా వదిలేయడం కంటే.. మీ శరీర అవసరాలకు సరిపోయే సమతుల్యమైన అల్పాహారం తీసుకోవడం మంచిది.

### గంటల తరబడి కూర్చుంటున్నారా?

ఆఫీసు పని, కంప్యూటర్ పని, టీవీ లేదా మొబైల్ కారణంగా రోజులో చాలా గంటలు కూర్చునే అలవాటు పెరిగింది. ఎక్కువసేపు నిరంతరంగా కూర్చోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. డయాబెటిస్ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు కూడా ఎక్కువసేపు కూర్చునే సమయాన్ని కనీసం ప్రతి 30 నిమిషాలకు ఒకసారి కదలికతో విరమించుకోవాలని సూచిస్తున్నాయి. అందుకే గంటల తరబడి ఒకే చోట కూర్చోకుండా మధ్య మధ్యలో లేచి కొద్దిసేపు నడవడం, రోజువారీ శారీరక శ్రమను పెంచడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ఉపయోగకరంగా ఉంటుంది.

### నిద్ర విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారా?

రాత్రిళ్లు ఆలస్యంగా పడుకోవడం, ప్రతిరోజూ వేర్వేరు సమయాల్లో నిద్రపోవడం, సరిపడా నిద్ర లేకపోవడం వంటి అలవాట్లు కూడా మెటబాలిక్ ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు. నిద్ర నాణ్యత, నిద్ర సమయం, నిద్ర విధానాలు టైప్-2 డయాబెటిస్ ప్రమాదంతో సంబంధం కలిగి ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే పెద్దలకు సాధారణంగా అవసరమైనంత నిద్రను క్రమమైన సమయాల్లో పొందడం, రాత్రివేళ నిద్రకు ఆటంకం కలిగించే అలవాట్లను తగ్గించడం ముఖ్యం. "7–8 గంటలు అందరికీ తప్పనిసరి" అనే ఒకే సంఖ్య కంటే, వయసు మరియు వ్యక్తిగత అవసరాలకు సరిపోయే తగినంత నిద్రపై దృష్టి పెట్టడం మంచిది.

### స్మోకింగ్ అలవాటు ఉందా?

సిగరెట్ తాగడం ఊపిరితిత్తులకే కాదు.. రక్తంలో చక్కెర నియంత్రణకు కూడా ఇబ్బందులు కలిగించవచ్చు. CDC ప్రకారం, పొగ తాగేవారికి పొగతాగని వారితో పోలిస్తే టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం సుమారు 30–40 శాతం ఎక్కువగా ఉంటుంది. నికోటిన్‌తో పాటు పొగలోని ఇతర రసాయనాలు శరీరంలో ఇన్సులిన్ పనితీరు, వాపు వంటి ప్రక్రియలపై ప్రభావం చూపవచ్చు. కాబట్టి డయాబెటిస్ ముప్పును తగ్గించుకోవాలనుకునేవారు తీపి పదార్థాలను మాత్రమే కాకుండా.. స్మోకింగ్‌ను కూడా దూరం పెట్టడం చాలా ముఖ్యం.

### స్వీట్లు మానేయడం మాత్రమే సరిపోదు..

టైప్-2 డయాబెటిస్ ముప్పు విషయంలో ఒకే ఒక్క అలవాటును నిందించడం సరైనది కాదు. ఆహారం, శారీరక శ్రమ, నిద్ర, పొగ తాగడం, శరీర బరువు, కుటుంబ చరిత్ర వంటి అనేక అంశాలు కలిసి ప్రభావం చూపుతాయి. అందుకే తీపి పదార్థాలను తగ్గించడంతో పాటు, రోజువారీ ఆహారంలో ఎక్కువగా ప్రాసెస్ చేసిన పదార్థాలను తగ్గించడం, కదలిక పెంచడం, తగినంత నిద్రపోవడం, స్మోకింగ్‌కు దూరంగా ఉండడం వంటి మార్పులు చేయడం ఉపయోగకరంగా ఉంటుంది.

---

# ఐస్‌క్రీమ్ ఆరోగ్యానికి మేలు చేస్తుందా?

ఐస్‌క్రీమ్ తినను, ఐస్‌క్రీమ్‌ను చదువుతాను. డబ్బా మీద రియల్ ఐస్‌క్రీమ్ అని రాసి ఉంటేనే తింటాను. వెజిటబుల్ ఆయిల్‌తో చేసింది నిజమైన ఐస్‌క్రీమ్ కాదు అంటూ కొన్నేళ్ల క్రితం టీవీల్లో అడ్వర్టైజ్ మెంట్ వచ్చింది.



### ఐస్‌క్రీమ్ పేరుతో మనం తినేది ఏంటి?

వెజిటబుల్ ఆయిల్ ఉండే పదార్థాలను ఐస్‌క్రీమ్ అని కాకుండా ఫ్రోజెన్ డిజర్ట్‌గా గుర్తించాలంటూ భారత ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సంస్థ పేర్కొంది. అసలు ఐస్‌క్రీమ్, ఫ్రోజెన్ డిజర్ట్ మధ్య తేడా ఏంటి? చల్లని తీపి పదార్థాలను ఇష్టపడే సగటు వ్యక్తికి ఈ రెండింటిలో పెద్ద తేడా ఏం కనిపించదు. ఎందుకంటే ఈ రెండూ రుచిలో దాదాపు ఒకేలా తీపిగా ఉంటూ, చల్లచల్లగా నోట్లో కరిగిపోతాయి. మరి వీటి మధ్య తేడాను ఎలా గుర్తించాలి? ఇంకో విషయం, గత 30 ఏళ్లుగా ఫ్రోజెన్ ట్రీట్స్ ఇండస్ట్రీలో భారత్‌లో గుర్తింపు పొందిన 'క్వాలిటీ వాల్స్' సంస్థ ఈ మధ్యకాలంలో ఒక ప్రకటన చేసింది. 2027 నాటికి తమ పోర్ట్‌ఫోలియోను పూర్తిగా 100 శాతం పాల ఆధారిత ఐస్‌క్రీమ్ ఉత్పత్తులుగా మార్చేస్తామని ప్రకటించింది. 'ప్రపంచ వ్యాప్తంగా క్వాలిటీ వాల్స్ ఇక ఫ్రోజెన్ డిజర్ట్ కంపెనీ కాదు. భారత్‌లో మాది ఒక ఐస్‌క్రీమ్ కంపెనీ. కంపెనీలో అంతా మారింది" అని ది మాగ్నమ్ ఐస్‌క్రీమ్ కంపెనీ గ్లోబల్ సీఈవో పీటర్ వ్యాఖ్యానించారు. క్వాలిటీ వాల్స్ పేరెంట్ సంస్థ ది మాగ్నమ్ ఐస్‌క్రీమ్ కంపెనీ.

### ఐస్‌క్రీమ్ అని దేనిని అనాలి?

ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఐస్‌క్రీమ్, ఫ్రోజెన్ డిజర్ట్ రెండూ వేర్వేరు కేటగిరీలకు చెందినవి. దీనిప్రకారం, ఐస్‌క్రీమ్ తప్పనిసరిగా డెయిరీ ఫ్యాట్‌తో తయారు చేయాలి. ఇందులో కనీసం 10 శాతం మిల్క్ ఫ్యాట్, 3.5 శాతం ప్రోటీన్ తప్పనిసరిగా ఉండాలి. పాలతో చేసే ఉత్పత్తులనే ఐస్‌క్రీమ్‌లుగా వర్గీకరించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు తెలుపుతున్నాయి. FSSAI 2.1.14 రూల్ ప్రకారం ఐస్‌క్రీమ్, కుల్ఫీ, చాక్లెట్ ఐస్‌క్రీమ్, సాఫ్టీ ఐస్‌క్రీమ్ వంటి ఉత్పత్తులను డైరీ బేస్డ్ డిజర్ట్స్ విభాగంలో చేర్చారు. పాలు లేదా పాల ఉత్పత్తుల నుంచి తయారుచేసిన పాశ్చరైజ్డ్ మిశ్రమాన్ని గడ్డకట్టించడం ద్వారా ఈ పదార్థాలను తయారు చేస్తారు. వీటిలో పోషక తీపి పదార్థాలు (nutritive sweeteners), అనుమతించిన ఇతర నాన్-డైరీ పదార్థాలు కలపవచ్చు లేదా కలపకపోవచ్చు. వీటిలోకి గాలిని చిలకరించవచ్చు. ఇవి గట్టిగా ఉండాలి. సాఫ్టీకి మినహాయింపు ఉంది. సాఫ్టీ మెత్తగా ఉంటుంది.

### ఫ్రోజెన్ డిజర్ట్ అంటే..

ఎఫ్ఎస్ఎస్ఐ రూల్స్ ప్రకారం, ఎడిబుల్ వెజిటబుల్ ఆయిల్ లేదా వాటి ఫ్యాట్స్‌తో తయారయ్యే పదార్థాలను ఫ్రోజెన్ డిజర్ట్స్ అంటారు. వీటిలో వెజిటబుల్ ప్రోటీన్లను కూడా వాడొచ్చు. ఈ ఉత్పత్తుల్లో పోషక తీపి పదార్థాలతో పాటు ఇతర నాన్ డైరీ పదార్థాలు కలుపుతారు. ఇందులోనూ మిల్క్, మిల్క్ సాలిడ్స్ వాడొచ్చు. అయితే, ఐస్‌క్రీమ్, ఫ్రోజెన్ డిజర్ట్స్ మధ్య ప్రధాన తేడా వాటిలో వాడే కొవ్వు మూలం. ఐస్‌క్రీమ్‌లో పాల కొవ్వు ఉండగా, ఫ్రోజెన్ డిజర్ట్స్‌లో వెజిటబుల్ ఆయిల్ కొవ్వు వాడతారు. ఫ్రోజెన్ డిజర్ట్స్‌లో పాల కొవ్వును వాడరు కాబట్టి దానికి ప్రత్యామ్నాయంగా పామాయిల్, వనస్పతి వంటి ఇతర నూనెలను కలుపుతారని ఇవి ఆరోగ్యానికి హానికరమని వైజాగ్‌కు చెందిన క్లినికల్, మెడికల్ కన్సల్టెంట్, డైటీషియన్ నీతి దిలీప్ చెప్పారు. 'పామాయిల్ అనే కాదు.. గది ఉష్ణోగ్రత వద్ద గడ్డకట్టే ఏ కొవ్వు పదార్థమైనా ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. ఒకప్పుడు 45 లేదా 50 ఏళ్లు వస్తే నడివయసుగా భావించేవారు. కానీ ఇప్పుడది 35 ఏళ్లకు పడిపోయింది. ఒక వ్యక్తి 35 ఏళ్లు వచ్చేసరికే రకరకాల ఆరోగ్య సమస్యల బారిన పడతున్నారు. గుండెపోటు, కార్డియక్ అరెస్ట్, పక్షవాతం వంటివి చాలా సాధారణమైపోయాయి. దీనికి ప్రధాన కారణం.. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు విపరీతంగా పెరిగిపోవడం. అధిక చక్కెరతో పాటు అనారోగ్యకరమైన కొవ్వులు, ముఖ్యంగా ట్రాన్స్ ఫ్యాట్స్, సాచురేటెడ్ ఫ్యాట్స్ తీసుకోవడం వల్ల ఇది జరుగుతుంది. ప్రాసెస్ చేసిన నూనెలు, పామాయిల్, వనస్పతి, వంటివన్నీ ఈ కోవలోకే వస్తాయి' అని నీతి దిలీప్ వివరించారు. ఇక చక్కెర పరంగా చూస్తే.. ఐస్‌క్రీమ్ అయినా ఫ్రోజెన్ డిజర్ట్ అయినా రెండూ ఆరోగ్యానికి హానికరమే అని ఆమె స్పష్టం చేశారు.

### లేబుల్‌పై తప్పనిసరిగా ప్రస్తావించాలా?

పాలతో చేసే ఉత్పత్తులనే 'ఐస్‌క్రీమ్' అని, వెజిటబుల్ ఆయిల్‌తో తయారయ్యే ఉత్పత్తులను 'ఫ్రోజెన్ డిజర్ట్' అని స్పష్టంగా లేబుల్‌పై రాయాలని FSSAI నిబంధనలు స్పష్టం చేశాయి. అలాగే ఫ్రోజెన్ డిజర్ట్ ప్యాకెట్‌పై "Made with Edible Vegetable Oil/Fat" అని ప్రింట్ చేయడం తప్పనిసరి. FSSAI చట్టం ప్రకారం పాల కొవ్వు కాకుండా ఇతర నూనెలను ఉపయోగించే ఏ ఉత్పత్తిపైనా 'Ice Cream' అని రాయడం చట్టరీత్యా నేరం.

### కుల్ఫీని ఐస్‌క్రీమ్ అనొచ్చా?

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS), ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం.. కుల్ఫీ కూడా ఐస్‌క్రీమ్ కేటగిరీ కిందకే వస్తుంది. అయితే, సాధారణ ఐస్‌క్రీమ్‌లో గాలిని చిలుకుతారు (Churning). కానీ కుల్ఫీలో చిక్కటి పాలను నేరుగా మౌల్డ్స్‌లో పోసి గాలి చేరకుండా గడ్డకట్టిస్తారు.

### పదార్థా గురించి ఎలా తెలుసుకోవాలి?

ఏదైనా కొనుగోలు చేసేటప్పుడు, ప్యాకింగ్ వెనుక ఉన్న పదార్థాల జాబితా చూడాలి. ఆ జాబితాలో మొదటి మూడు స్థానాల్లో ఉండే పదార్థాలే ఆ ఉత్పత్తిలో అత్యధిక పరిమాణంలో ఉంటాయి. చివరగా పేర్కొన్నవి అతి తక్కువ పరిమాణంలో ఉంటాయని హైదరాబాద్‌కు చెందిన న్యూట్రీషియన్ అంజలి –తో చెప్పారు. 'తినే పదార్థాల్లో మిల్క్ సాలిడ్స్ లేదా కృత్తిమ రంగులు ఉంటే అవి ఆరోగ్యానికి చేటు చేయవచ్చు. మిల్క్ సాలిడ్స్‌లో ఆక్సిడైజ్డ్ కొలెస్ట్రాల్ ఉండే అవకాశం ఉంది. ఇది రక్తనాళాలను దెబ్బతీసి గుండె సంబంధిత వ్యాధులకు దారి తీస్తుంది. అందుకే తరచుగా ఇలాంటివి తినకూడదు. కృత్రిమ చక్కెరలైన లిక్విడ్ గ్లూకోజ్, ఇన్వర్టెడ్ షుగర్ సిరప్‌తో పాటు వెజిటబుల్ సోయా ప్రొటీన్, స్టెబిలైజర్లు, ఎమల్సిఫైయర్లు ఉన్న ఆహారపదార్థాలు ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదు. వీటికి వీలైనంతవరకు దూరంగా ఉండాలి' అని ఆమె తెలిపారు.

### చల్లని పదార్థాలు తినొచ్చా?

అసలు ఆయుర్వేదం ప్రకారం చల్లగా గడ్డకట్టిన ఏ పదార్థమైనా శరీరానికి మంచిది కాదని నీతి దిలీప్ తెలిపారు. ఆ విధంగా చూసుకున్నా చల్లచల్లటి ఐస్‌క్రీమ్, ఫ్రోజెన్ డిజర్ట్‌లు రెండూ ఆరోగ్యానికి మంచివి కావని ఆమె చెప్పారు. 'కుల్ఫీ అయినా, పానీయాలు అయినా, ఆఖరికి పండ్లైనా సరే.. బాగా చల్లబరిచి లేదా గడ్డకట్టించి తింటే ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. ఎందుకంటే మన శరీరం సహజమైన పద్ధతులకు అలవాటు పడేలా నిర్మితమైంది' అని నీతి దిలీప్ చెప్పారు. పోషకాహార పరంగా చూస్తే కుల్ఫీ, ఫ్రోజెన్ డిజర్ట్, ఐస్‌క్రీమ్స్‌లో చక్కెర, కేలరీలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి వీటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు, లేదా స్థూలకాయం ఉన్నవారు వైద్యులు లేదా డైటీషియన్ల సలహా మేరకు సరైన వాటిని ఎంచుకోవడం మంచిదని సూచిస్తున్నారు.



### ఇంట్లోనూ వేడి ముప్పు..

చల్లగా ఉండేందుకు ఇలా చేయండి!బయట ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు ఇళ్లలో వేడి తగ్గించుకునే చర్యలు చేపట్టాలి. మధ్యాహ్నం వేళ కిటికీలకు తెరలు వేయాలి. ఉదయం, సాయంత్రం చల్లని గాలులు వచ్చే సమయంలో గాలి ప్రసరణకు అవకాశం కల్పించాలి. వీలైతే ఇంటి పైకప్పుపై తెలుపు రంగు పూత లేదా వేడిని తగ్గించే పూత వేయించుకోవచ్చు. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారిని అధిక వేడి నుంచి ప్రత్యేకంగా కాపాడాలి.

## బహుజన తెలంగాణ కోసం..

# బతుకమ్మ మరోసారి ఉద్యమ స్వరూపం దాల్చాలి

**ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను మార్చడం కాదు..**
**మోదీని దించాలి.. వ్యవస్థను మార్చాలి**
**ఈవీఎంలను పక్కనపెట్టి బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలి**
**ముఖ్యమంత్రి ముక్కుపిండి అయినా ఉస్మానియాకు రూ. వెయ్యి కోట్లు సాధిస్తాం**
**గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాలకు అన్యాయం చేశాయి**
**తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత**
**ఓయూ విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడిన కవిత**



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలో సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛతో కూడిన బహుజన రాజ్యం సాధించాలంటే బతుకమ్మ మరోసారి ఉద్యమ స్వరూపం దాల్చాలని తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను ఏకం చేసిన బతుకమ్మ స్ఫూర్తితో నేడు పేదలు, బడుగు బలహీనవర్గాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించే మరో పోరాటం జరగాలన్నారు. దేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను మార్చినంత మాత్రాన ప్రయోజనం ఉండదని, ప్రధాని నరేంద్ర మోదీని అధికారం నుంచి దింపి మొత్తం ఎన్నికల వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఆదివారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కవిత పాల్గొన్నారు. విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.తెలంగాణ ఉద్యమానికి బతుకమ్మ స్ఫూర్తిఉస్మానియా విశ్వవిద్యాలయం పేరు వినగానే తెలంగాణ ఉద్యమం గుర్తుకు వస్తుందని కవిత అన్నారు. తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో ఉస్మానియా విద్యార్థులు చేసిన పోరాటాలను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరచిపోదన్నారు. ప్రపంచమంతా దేవుళ్లను పూలతో పూజిస్తే, తెలంగాణ ప్రజలు పూలనే దేవతగా కొలుస్తారని చెప్పారు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటేందుకు ఉద్యమ సమయంలో బతుకమ్మను ఒక సాధనంగా మలుచుకున్నామని గుర్తుచేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బాలగంగాధర్ తిలక్ వినాయక చవితిని ప్రజా చైతన్యానికి వేదికగా మార్చినట్లే, తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మను పోరాటానికి ప్రతీకగా నిలిపామన్నారు.బతుకమ్మలో అన్ని రకాల పూలకు చోటు ఉన్నట్లే రేపటి తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, అధికారంలో భాగస్వామ్యం ఉండాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ కేవలం ఆటపాటలకే పరిమితం కాకుండా సామాజిక మార్పునకు వేదిక కావాలని పిలుపునిచ్చారు.ఉస్మానియాకు రూ.వెయ్యి కోట్లు ఇచ్చేదాకా పోరాటంఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.వెయ్యి కోట్లు ప్రకటించి ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని కవిత ఆరోపించారు. ఇటీవల లా కళాశాల విద్యార్థుల ఆహ్వానం మేరకు వసతిగృహాలను సందర్శించగా ఒక్కో గదిలో ఎనిమిది మంది ఉంటున్న దుస్థితి కనిపించిందన్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.విశ్వవిద్యాలయంలో 74 శాతం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాల్లోనూ అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వ విద్యాలయాలను నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఉన్నందుకు మరోసారి క్షమాపణలు చెబుతున్నానన్నారు. ముఖ్యమంత్రి ముక్కుపిండి అయినా ప్రకటించిన రూ.వెయ్యి కోట్లు సాధించుకుందామని, అవసరమైతే ఆర్ట్స్ కళాశాల వేదికగా మరో ఉద్యమం చేపడదామని పిలుపునిచ్చారు.ఎన్నికల కమిషనర్‌ను మార్చితే సరిపోదుదేశంలో ఎన్నికల వ్యవస్థ సమూలంగా మారాలని కవిత అభిప్రాయపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో తాను ఏకీభవించడం లేదన్నారు. ఒకరిని తొలగిస్తే ప్రధాని మోదీ తనకు అనుకూలమైన మరొకరిని నియమించుకుంటారని వ్యాఖ్యానించారు. అందుకే వ్యక్తులను మార్చడం కాకుండా వ్యవస్థనే మార్చాలని స్పష్టం చేశారు. ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ వాటిని పక్కనపెట్టి తిరిగి బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం విద్యార్థులు నిర్భయంగా ప్రశ్నించాలని సూచించారు.రోహిత్ వేముల చట్టం ఏమైంది?కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణలో రోహిత్ వేముల చట్టం తీసుకొస్తామని ఇచ్చిన హామీ ఏమైందని కవిత ప్రశ్నించారు. అశోకనగర్‌కు వచ్చి ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదని నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు.అనుచరులుగా కాదు.. నాయకులుగా ఎదగాలివిశ్వవిద్యాలయాలు కేవలం పట్టాలు అందించే కేంద్రాలుగా కాకుండా సమాజాన్ని నడిపించే నాయకులను తయారు చేసే కేంద్రాలుగా మారాలని కవిత ఆకాంక్షించారు. పీవీ నరసింహారావు, జార్జిరెడ్డి, గద్దర్, కిషన్‌జీ, స్వర్ణక్క వంటి విభిన్న భావజాలాలకు చెందిన నాయకుల ప్రస్థానాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. విశ్వవిద్యాలయాల్లో భిన్న ఆలోచనలు, స్వేచ్ఛాయుత చర్చలు, భావ సంఘర్షణలు జరిగినప్పుడే సామాజిక మార్పు సాధ్యమవుతుందన్నారు.విద్యార్థి సంఘాల ఎన్నికలను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. పేదింటి బిడ్డలు రాజకీయ నాయకులుగా ఎదగాలంటే విద్యార్థి దశ నుంచే నాయకత్వ అవకాశాలు కల్పించాలన్నారు. లేకపోతే రాజకీయాలు కొద్దిమంది నాయకుల కుటుంబాలకే పరిమితమవుతాయని హెచ్చరించారు. విద్యార్థులు ఎవరికో అనుచరులుగా మిగిలిపోకుండా స్వతంత్ర ఆలోచనలతో నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉస్మానియా విద్యార్థులే సామాజిక న్యాయంతో కూడిన బహుజన తెలంగాణ నిర్మాణానికి మరోసారి ముందుండాలని కవిత కోరారు.

# క్యాన్సర్ అవగాహన ర్యాలీ





**పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్**

**ముద్ర, శేరిలింగంపల్లి:** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి స్టేడియంలో గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీ మరియు క్యాన్సర్ 5కె రన్ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. పీఏసీ ఛైర్మన్ అరికపూడి గాంధీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి ర్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీహరి మాట్లాడుతూ క్యాన్సర్‌పై సమష్టి పోరాటంతోనే విజయం సాధ్యం అని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఇలాంటి కార్యక్రమాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం స్ఫూర్తిదాయకమని మంత్రి పిలుపునిచ్చారు. క్యాన్సర్‌పై అవగాహనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, వ్యాధి పట్ల ఉన్న అపోహలను తొలగించడం, ముందస్తు గుర్తింపు పరీక్షల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం మనందరి బాధ్యత. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స పొందే అవకాశాలు పెరుగుతాయని పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధఈ అన్నారు. గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో క్యాన్సర్ రన్ నిర్వహించడం చాలా గొప్ప విషయం అని పీఏసీ ఛైర్మన్ గాంధీ కొనియాడారు.

# నైపుణ్యంతో కొలువుల బాట

**సింగరేణి ఆర్జీ–1 నైపుణ్య శిక్షణ కేంద్రం నుంచి 112 మందికి ఉద్యోగాలు**
**ఫాక్స్‌కాన్‌లో 87 మంది మహిళలకు ఉపాధి అవకాశం**
**తొలి విడతలో హైదరాబాద్‌కు బయలుదేరిన 55 మంది మహిళలు**
**రెండేళ్లలో 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు**

**ముద్ర, హైదరాబాద్:** సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం సత్ఫలితాలనిస్తోంది. సింగరేణి రామగుండం–1 ఏరియాలోని జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందిన 112 మంది యువతీ యువకులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో 87 మంది మహిళలు హైదరాబాద్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగాలు సాధించగా, మరో 25 మంది సోలార్ టెక్నీషియన్లుగా ఎంపికయ్యారు. ఫాక్స్‌కాన్‌లో ఉద్యోగాలకు ఎంపికైన మహిళల్లో తొలి విడతగా 55 మంది ఆదివారం గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు.శిక్షణతో ఉపాధికి బాటలురాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క రెండేళ్ల క్రితం ప్రారంభించిన జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వివిధ కోర్సుల్లో శిక్షణ అందిస్తూ ఉద్యోగ అవకాశాలతో అనుసంధానం చేస్తోంది. ఈ కేంద్రం ద్వారా గత రెండేళ్లలో 500 మందికి పైగా యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభించాయి. తాజాగా నిర్వహించిన ఉద్యోగ ఎంపిక ప్రక్రియలో 154 మంది పాల్గొనగా, 112 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.ఫాక్స్‌కాన్‌లో 87 మంది మహిళలకు ఉద్యోగాలుహైదరాబాద్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులు గత వారం జీవీటీసీ కేంద్రంలో ప్రత్యేక ఉద్యోగ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 127 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వారిలో 87 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు కంపెనీ తయారీ కేంద్రంలో ఆపిల్ ఇయర్‌పాడ్స్, ఇతర ఎలక్ట్రానిక్ విడిభాగాల అసెంబ్లింగ్ విభాగాల్లో పనిచేయనున్నారు. మహిళలు పారిశ్రామిక రంగంలో ఉద్యోగాలు సాధించడం వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడనుంది.మరోవైపు సోలార్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ పొందిన 27 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్జీ–1 జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ తెలిపారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో విధుల్లో చేరనున్నట్లు వెల్లడించారు.నైపుణ్యాలే ఉజ్వల భవిష్యత్తుకు పునాదిసింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆర్జీ–1 జీఎం డి.లలిత్ కుమార్ తెలిపారు. పరిశ్రమల్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ అందించడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు చూపుతున్నామన్నారు. శిక్షణను ఉద్యోగాలతో అనుసంధానించడం వల్ల యువత ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం లభిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి వృత్తిపరంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం ఎస్.కె.చంద్రశేఖర్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, టాస్క్ మేనేజర్ డాక్టర్ కౌసల్య, ఎల్ అండ్ ఎన్ డైరెక్టర్ కౌశల్, ఫాక్స్‌కాన్ హెచ్ఆర్ ప్రతినిధి ఆర్.శ్రీనివాస్, జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాహుల్ కదం



**ముద్ర, జవహర్ నగర్ :** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్, కీసర సర్కిల్, చంద్రపురి కాలనీ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కదం రాహుల్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని రాహుల్ కదం కు అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అర్హులకు అందే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. రాబోయే పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాహుల్ కదం మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నయ్య, డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తో పాటు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియ చేశారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం అహర్నిశలు పాటుపడతానని ఈ సందర్భంగా వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గడ్డం శ్రీనివాస్, ఏ బ్లాక్ అధ్యక్షులు మాట్లా శ్రీనివాస్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్, సత్యం, మాట్ల వినయ్ కుమార్, వెంకటేశ్, భాస్కర్, సోమేష్ చారి, కాలేశా, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇకెబానా కళాకారిణి నిర్మలా అగర్వాల్‌కు జపాన్ ప్రభుత్వ గౌరవ పురస్కారం

**భారత్–జపాన్ సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి విశేష కృషి**
**'కాన్సుల్ జనరల్ ప్రశంసా పురస్కారం'తో సత్కారం**



**ముద్ర, హైదరాబాద్:** భారత్, జపాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాలు, సాంస్కృతిక అనుబంధం, పరస్పర అవగాహనను పెంపొందించడంలో విశేష కృషి చేసిన హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఇకెబానా కళాకారిణి నిర్మలా అగర్వాల్‌కు అరుదైన గౌరవం దక్కింది. జపాన్ సంప్రదాయ పుష్పాలంకరణ కళ అయిన ఇకెబానా వ్యాప్తికి ఆమె అందించిన సేవలను గుర్తించిన జపాన్ కాన్సులేట్ జనరల్ 'కాన్సుల్ జనరల్ ప్రశంసా పురస్కారం'తో సత్కరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని సైబర్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.జపాన్ సంప్రదాయ కళారూపమైన ఇకెబానాలో నిర్మలా అగర్వాల్‌కు రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. 2000 సంవత్సరంలో ఈ కళను అభ్యసించడం ప్రారంభించిన ఆమె, జపాన్‌లోని ప్రతిష్ఠాత్మక ఓహారా స్కూల్ ఆఫ్ ఇకెబానా నుంచి అసోసియేట్ ఫస్ట్ మాస్టర్ డిగ్రీని పొందారు. ప్రస్తుతం ఓహారా స్కూల్ హైదరాబాద్ విభాగానికి రెండోసారి అధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు.ఆమె నేతృత్వంలో ఓహారా స్కూల్ ప్రధాన గురువు తొలిసారిగా హైదరాబాద్‌ను సందర్శించి ప్రత్యేక ప్రదర్శన, శిక్షణ శిబిరం నిర్వహించారు. అంతేకాకుండా నగరంలో తొలి అఖిల భారత ఇకెబానా సదస్సును విజయవంతంగా నిర్వహించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనడంతోపాటు పాఠశాలలు, విద్యాసంస్థలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జపాన్ కళను విస్తృతంగా పరిచయం చేశారు.ప్రతి పువ్వు ఓ కథ చెబుతుంది: నిర్మలా అగర్వాల్ఇకెబానా అంటే కేవలం పూలను అందంగా అలంకరించడం మాత్రమే కాదని, పువ్వులు, ఆకులు, కొమ్మల అమరిక ద్వారా భావాలను, ఆలోచనలను వ్యక్తీకరించే విశిష్ట కళ అని నిర్మలా అగర్వాల్ పేర్కొన్నారు. ఈ కళలోని సామరస్యం, సమతుల్యం, సరళత, నిష్పత్తి వంటి అంశాలు భారతీయ, జపాన్ సంస్కృతుల్లోని ఉమ్మడి సౌందర్య విలువలకు ప్రతీకలని వివరించారు.జపాన్ కాన్సులేట్ నుంచి గౌరవ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. తన కళా ప్రయాణంలో ప్రోత్సహించిన జపాన్ కాన్సులేట్‌తోపాటు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు ఇకెబానా కళను మరింత విస్తృతంగా ప్రచారం చేసేందుకు స్ఫూర్తినిస్తుందని చెప్పారు. 'ప్రతి పువ్వు ఒక కథ చెబుతుంది. ప్రకృతిని వినడం ఎలాగో ఇకెబానా కళ నాకు నేర్పింది' అని నిర్మలా అగర్వాల్ పేర్కొన్నారు.

## ప్రశాంత్ నగర్ బిజెపి డివిజన్ కార్యవర్గ సమావేశం



**ముద్ర, కూకట్‌పల్లి:** ప్రశాంత్ నగర్ బిజెపి డివిజన్ అధ్యక్షుడు గాదే వీరన్ కుమార్ అధ్యక్షతన డివిజన్ కార్యవర్గ సమావేశం వైభవంగా నిర్వహించారు. ఈ సమావేశానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులువడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య ఘనంగా శాలువాతో సన్మానించారు.ఈ సమావేశంలో డివిజన్ పరిధిలోని బిజెపి సీనియర్ నాయకులకు పార్టీ పరంగా పలు నూతన బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన నాయకులను వడ్డేపల్లి రాజేశ్వరరావు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ... నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని, సీనియర్లు, యువత సమన్వయంతో పనిచేస్తూ ప్రశాంత్ నగర్ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి నాయకులు, సీనియర్ నాయకులు, నూతన పదవీబాధ్యతలు స్వీకరించిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 12.10.2026
www.mudranews.in | @mudranews



## ఆహారంలో మార్పులు.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి!

ఎండ తీవ్రత పెరిగినప్పుడు శరీరానికి తగిన పోషకాలు, ద్రవాలు అందేలా చూసుకోవాలి. పండ్లు, కూరగాయలు, మజ్జిగ, పప్పు పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలి. ఎక్కువ నూనెతో చేసిన ఆహారం, ఎక్కువసేపు బయట ఉంచిన పదార్థాలను తగ్గించాలి. ఆహారాన్ని శుభ్రంగా నిల్వ చేయాలి. వడదెబ్బతో పాటు నీటి కొరత సమయంలో కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులపైనా అప్రమత్తంగా ఉండాలి.



## సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్ కు గౌరవ డాక్టరేట్

**డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ అవార్డు ప్రధానం..**
*** హర్షం వ్యక్తం చేస్తూ పలువురి అభినందనలు..**




**ముద్ర చిగురుమామిడి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్)దక్కింది.గత 26సంవత్సరాలుగా ఆయన సమాజానికి అందించిన విశిష్ట సేవలను,విద్యార్థుల్లో దాగినటువంటి నైపుణ్యాన్ని వెలికితీస్తూ,సామాజిక చైతన్య కార్యక్రమాలను గుర్తిస్తూ యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్షిప్ & ఎక్సలెన్స్ వారు ఈ గౌరవాన్ని ప్రకటించారు.ఈ డాక్టరేట్ (ఆనర్స్) అవార్డును యునైటెడ్ అమెరికన్ విశ్వవిద్యాలయం ఫౌండర్ చైర్మన్ కే వెంకటేశన్,జాయింట్ డైరెక్టర్ గౌని నరసింహ గౌడ్,రాయబారి ప్రపంచ శాంతి సంస్థ అధ్యక్షుడు డా. పర్విందర్ సింగ్,డాక్టర్ స్వామి పద్మేంద్ర,అభిషేక్ పుష్కర్,కలరత్న డాక్టర్ కందుకూరి విజయమోహన్ తెలంగాణ యూఏ యు డిప్యూటీ డైరెక్టర్,డాక్టర్ వసంతి అజయ్ కుమార్ యూఏయూ ఫ్యాన్స్& డైరెక్టర్ ప్రెసిడెంట్ ,డాక్టర్ ఎం రామచంద్రం,డా.మదన్, ఏకే దయానంద్,డా.రామకృష్ణ టంగుటూరి కన్వీనర్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ చాంబర్ వాణిజ్యమండలి గార్ల చేతుల మీదిగా గౌరవ డాక్టరు డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ అవార్డు చెన్నెలోని కృష్ణ గానసభ ఆడిటోరియంలో ప్రధానం చేయడం జరిగిందని శ్రీనివాస్ తెలిపారు.చిగురుమామిడి ప్రాంతానికి చెందిన ఒక సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్ అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీ నుంచి ఈ విధమైన గౌరవాన్ని అందుకోవడంపై స్థానికులు ఎంతో హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.యూనివర్సిటీ ఫౌండర్ కే వెంకటేశన్ మాట్లాడుతూ ప్రపంచ శ్రేష్ఠత నాయకత్వం,మానవ సహకారాన్ని గుర్తించడం

యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ & ఎక్సలెన్స్, సమాజానికి అర్థవంతమైన సేవలు అందించిన విశిష్ట వ్యక్తులకు ఈ గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేయడం జరిగిందన్నారు.ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు,యునైటెడ్ అమెరికన్ విశ్వవిద్యాలయం అందించే అత్యున్నత గౌరవాలలో ఇది ఒకటి.ఎవరి జీవితం,పని,ప్రభావం, విలువలు ప్రపంచంపై శాశ్వతమైన సానుకూల ప్రభావాన్ని చూపుతాయో వారిని ఇది గౌరవిస్తుందని,నిజమైన గొప్పతనాన్ని హోదాలు లేదా పదవులతో కాకుండా,సేవ, నిజాయితీ,నూతన ఆవిష్కరణలు, ఇతరులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లే సామర్థ్యంతో కొలుస్తారని అన్నారు.శ్రేష్ఠతను మూర్తీభవించి,మానవాళికి స్ఫూర్తినిచ్చే అటువంటి వ్యక్తుల పట్ల గౌరవానికి ప్రతీకగా ఈ గౌరవ డాక్టరేట్ నిలుస్తుంది అని యునైటెడ్ అమెరికన్ విశ్వవిద్యాలయం ఫౌండర్,చైర్మన్ డా.కే వెంకటేశన్ తెలిపారు.శ్రీనివాస్ కు ఈ అవార్డు రావడం పట్ల మండల ప్రజలు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందిస్తున్నారు.

## యూపీఐ MDR 0.4% అక్కర్లేదు.. 0.08% చాలు

ముద్ర, హైదరాబాద్ : యూపీఐ (UPI) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (MDR)ను తగ్గించాలని ఐఐటీ బాంబే (IIT Bombay) ప్రొఫెసర్లతో కూడిన బృందం ఒక నివేదికలో పేర్కొంది. ఎన్‌పీసీఐ ప్రతిపాదించిన 0.40 శాతం ఎండీఆర్ రేటును 0.08 శాతానికి తగ్గించాలని నివేదికలో తెలిపింది. డిపాజిట్ల నుంచి పెద్దఎత్తున బ్యాంకులు లాభాలు పొందుతున్నందున ఎండీఆర్‌లో పెద్దమొత్తంలో వాటా అవసరం లేదని అభిప్రాయపడింది.ప్రస్తుత ఎండీఆర్ విధానంలో దాదాపు 70 శాతం వరకు వాటా (ఇష్యూయర్, అక్వైరర్) బ్యాంకులకే వెళ్తున్నాయని ఐఐటీ బాంబే బృందం పేర్కొంది. కరెంట్, సేవింగ్స్ ఖాతాల ద్వారా బ్యాంకులు అధిక లాభాలు పొందుతున్నాయి కాబట్టి వాటికి కేటాయించిన ఎండీఆర్ వాటాను తగ్గించాలని తెలిపింది. మొత్తంగా ఎండీఆర్‌ను 0.08 శాతానికి పరిమితం చేయాలని సూచించింది. అందులో ఫోన్‌పే, గూగుల్ పే వంటి థర్డ్ పార్టీ యాప్‌లకు 0.6 శాతం, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు (బ్యాంకులు) గాను 0.02 శాతం వాటా కేటాయించాలని సూచించింది.

## విద్యార్థుల చదువుకు ఏఐ సాయం.. హైదరాబాద్‌లో కొత్త సాఫ్ట్‌వేర్

**హైదరాబాద్‌లో బ్రిలియన్స్ ఏఐ సాఫ్ట్‌వేర్ ఆవిష్కరణ**
**ప్రశ్నాపత్రాల తయారీ నుంచి మూల్యాంకనం వరకు సేవలు**
**విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులకు నివేదికలు**
**ఏఐ వినియోగంలో డేటా భద్రత కీలకం**



విద్యా సంస్థల నిర్వహణ, బోధన , అభ్యాస ప్రక్రియల్లో విప్లవాత్మక మార్పులు తేవడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో ప్రత్యేకంగా రూపొందించిన 'బ్రిలియన్స్ AI' (Brilliance AI) విద్యా సాఫ్ట్‌వేర్ సూట్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు. బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో శనివారం ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ఈ ఏఐ టూల్‌ను ఆవిష్కరించారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం వరకు సమగ్రమైన సేవలను ఈ సాఫ్ట్‌వేర్ అందిస్తుంది. అంతేకాకుండా విద్యార్థుల సందేహాల నివృత్తికి టెక్స్ట్, వాయిస్ ఆధారిత మద్దతు ఇవ్వడంతో పాటు, వారి అకడమిక్ ప్రగతిపై తల్లిదండ్రులకుప్పటికప్పుడు ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికలు అందించే సాంకేతికతను ఇందులో పొందుపరిచారు.

**సాంకేతికతతో విద్యా వ్యవస్థ విస్తరణ.. డేటా లీకేజీలపై హెచ్చరిక**

ఈ ఆవిష్కరణ సభలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకమైన మార్పులు తీసుకొస్తోందని, ఏఐ ఆధారిత సాధనాలు విద్యార్థుల అభ్యాస ప్రక్రియను మరింత సరళంగా, సమర్థవంతంగా మారుస్తాయని కొనియాడారు. ఎడ్యుటెక్ 2025 సర్వే ప్రకారం సాంకేతికతను ఉపయోగిస్తున్న పిల్లల్లో 77 శాతం మంది ప్రాక్టీస్ , నేర్చుకోవడానికే డిజిటల్ సాధనాలను వాడుతున్నారని ఆయన గుర్తుచేశారు. సంప్రదాయ బోధనా విధానాలకు సాంకేతికతను జోడించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అయితే దేశంలో ఇటీవల వెలుగుచూసిన నీట్ (NEET) పేపర్ లీక్ వంటి సంఘటనల తర్వాత.. విద్యా సంస్థల్లో డేటా భద్రత , రక్షణ ప్రాధాన్యత మరింత పెరిగిందని ఆయన నొక్కిచెప్పారు.

**డేటా గోప్యత, భద్రతకే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం**

సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, డిజిటల్ వ్యవస్థల భద్రత , డేటా ప్రైవసీని కాపాడటం అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. డేటా సెంటర్ల ఏర్పాటు , నిర్వహణలో డేటా భద్రత, గోప్యతలే ప్రధాన ప్రమాణాలుగా ఉండాలని ఉద్ఘాటించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే సమయంలో ఏఐ సాధనాలు ఎంతవరకు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేస్తున్నాయో ప్రతి ఒక్కరూ పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. డేటా రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు.

బాధ్యతాయుతమైన ఏఐ వినియోగానికి పిలుపు

ఏఐ సాంకేతికత తెచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు, దాని ద్వారా ఎదురయ్యే సవాళ్లపైనా నిరంతరం దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు, విద్యా సంస్థలకు నిజమైన ప్రయోజనం చేకూర్చే బాధ్యతాయుతమైన డిజిటల్ పరిష్కారాలను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. సాంకేతిక ఆవిష్కరణలు సామాజిక శ్రేయస్సుకు, విద్యాభివృద్ధికి దోహదపడేలా డిజిటల్ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ముందుకుసాగాలని ఐటీ నిపుణులకు, ఎడ్యుటెక్ సంస్థలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.

## రష్యా-ఉక్రెయిన్ మధ్య "ఎనర్జీ సీజ్-ఫైర్"..

**ట్రంప్ సంచలన ప్రకటన.!**



ముద్ర, న్యూఢిల్లీ : రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం సంభవించింది. రెండు దేశాల మధ్య తక్షణమే అమలులోకి వచ్చేలా 'ఎనర్జీ సీజ్–ఫైర్' ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ ఆదివారం తన సోషల్ మీడియా వేదికగా ట్రూత్ సోషల్‌లో ఈ ప్రకటన చేశారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య ఎనర్జీ రంగానికి సంబంధించిన కాల్పులు విరమణ తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఇరు దేశాలు ఈ ఒప్పందానికి అంగీకరించాయి, దీనిని ఉల్లంఘించవద్దని ట్రంప్ హెచ్చరించారు. అయితే, ఈ ఒప్పందం ఎంత కాలం అమలులో ఉంటుంది అనే దానిపై స్పష్టత లేదు.

ట్రంప్ ప్రకటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ స్పందిస్తూ.. ఇది తనకు కొత్త విషయమని అన్నారు. దీనికి ముందు ఆయన మాట్లాడుతూ.. రష్యా రిఫైనరీలపై దాడులు చేయమని, కానీ ముందుగా తమ ఎనర్జీ మౌలిక సదుపాయాలపై రష్యా దాడులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడి కనీసం 2 నెలల పాటు సంపూర్ణ కాల్పుల విరమణకు అంగీకరించేలా ట్రంప్‌ను జెలెన్‌స్కీ కోరారు. ఈ సమయంలో ఉక్రెయిన్ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటామని చెప్పారు.

ఇదిలా ఉంటే, తాజా పరిణామాలు ఉక్రెయిన్, అమెరికా మధ్య తీవ్ర విభేదాలకు కారణమవుతున్నాయి. రష్యా, తమపై దాడులు చేసేలా అమెరికా ప్రోత్సహిస్తోందని జెలెన్‌స్కీ ఆరోపించారు. ఇదే సమయంలో ఉక్రెయిన్‌కు కొత్త అధ్యక్షుడు రావాలని ట్రంప్ కోరడం సంచలనంగా మారింది. రష్యాతో శాంతి ఒప్పందం కుదుర్చుకోవడంలో జెలెన్‌స్కీ విఫలమయ్యారని విమర్శించారు. దీనికి ప్రతిగా తమ దేశ నాయకుడిని ఎన్నుకునే హక్కు ఉక్రెయిన్ ప్రజలకే ఉందని అన్నారు. రష్యాపై ఒత్తిడి తెచ్చి యుద్ధాన్ని ముగించేలా అమెరికా, యూరప్ పనిచేయాలని కోరారు.

# తెలుగు రాష్ట్రాల్లో కమ్ముకొస్తున్న తాగునీటి కొరత

**ముద్ర, హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్ని కరవు కమ్మేస్తోంది. ఇప్పటికే విరుచుకుపడ్డ ఎల్‌నినో మరింత భయానకంగా మారుతోంది. మొదట సాగునీరు.. తర్వాత తాగునీటికీ కటకట తప్పేలా లేదు. ఈ దుస్థితి ఆహార సంక్షోభానికి దారితీస్తుందని చెబుతున్నారు. అంతేకాదు ఇదే పరిస్థితి కొనసాగితే.. వచ్చే ఏడాది జనం మర్చిపోయిన కరెంట్ కోతల కాలం కూడా వస్తుందనే హెచ్చరికలు వస్తున్నాయి. ఏతావాతా తెలుగు రాష్ట్రాలకు మున్ముందు కరవు కాలం కంటిన్యూ అయ్యేలా ఉంది. ఎల్‌నినో రోజురోజుకీ తీవ్రంగా బలపడుతోంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో లోటు వర్షపాతం, వర్షాభావం పరిస్థితులు దాటి.. కరవు పరిస్థితులకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటి.. సాగునీటికే కాకుండా తాగునీటికీ కరవు వచ్చి పడింది. కొన్ని ప్రాంతాల్లో అనధికారికంగా నీటి పంపిణీ తగ్గగా.. రాబోయే రోజుల్లో భూగర్భజలం కూడా ఇంకిపోయే ప్రమాదం ఉందని భయాందోళనలు వ్యక్తమౌతున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా అవసరానికి మించిన వర్షమే పడుతూ వస్తోంది. చివరకు జూన్, జులైలో లోటు వర్షపాతం నమోదైనా.. ఆగస్ట్, సెప్టెంబర్‌లో కవరైపోయేలాగే వర్షం కురుస్తూ వచ్చింది. కొన్నిసార్లు కేవలం సెప్టెంబర్‌లో కురిన వానలే.. మొత్తం వర్షపాతం రికార్డుల్ని సరిచేసిన దాఖలాలున్నాయి. దీంతో ఈసారి కూడా ఎల్‌నినో ఎల్‌నినో అని ఎంత ఊదరగొట్టినా.. ఏదో నెలలో వర్షాలు పడి.. ప్రాజెక్టులు నిండుతాయనే ధైర్యం చాలా మంది అన్నదాతల్లో కనిపించింది. దీనికి తోడు ఎప్పుడూ అంచనాలు తప్పే మన వాతావరణ శాఖ.. ఈసారి మాత్రం కరెక్టుగా చెబుతుందా ఏంటి అనే ధీమా కూడా లేకపోలేదు. కానీ ఇవేవీ ఫలించలేదు. చివరకు ఎల్‌నినో రానే వచ్చింది. జూన్ లో వర్షాలు ముఖం చాటేశాయి. ఈ విషయాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. తర్వాత జులైలోనూ వర్షాలు సరిగ్గా పడలేదు. అయినా రైతులకు అదే ధీమా. ఆగస్టులో చూసుకుందాం.. మహా అయితే విత్తనాలు ఓ నెల ఆలస్యంగా విత్తుదాం అనుకున్నారు. కానీ ఆగస్టు కూడా సారీ చెప్పేసింది. చివరకు ఆఖరాశగా సెప్టెంబర్ వైపు ఆశగా చూశారు. పేరుకి తుపాన్ వచ్చినా.. గట్టిగా పది రోజులు కూడా వానలు పడలేదు.



ఇప్పుడు నైరుతి రుతుపవనాలు నిష్క్రమించాయి. ఇప్పుడు వర్షపాతం లెక్కలు చూస్తే.. తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర వర్షాభావం ఉందని తేలింది. ఏపీలో ఏకంగా 45 శాతం లోటు ఉంటే.. తెలంగాణలో 22 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీంతో రెండు రాష్ట్రాల్లోనూ ప్రాజెక్టులు నిండుకున్నాయి. సాగునీటి విషయంలో అధికారులు ముందే చేతులెత్తేశారు. అప్పుడు తాగునీటి కోసం నీటినిల్వలు పరిరక్షిస్తున్నామని చెప్పారు. కానీ ఇప్పుడు చూస్తే.. తాగునీటికీ కటకట తప్పేలా లేదు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో తాగునీరు ఇచ్చే వ్యవధితో పాటు నీటి పరిమాణం కూడా తగ్గిందనే ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని ఎవరూ అధికారికంగా నిర్ధారించకపోయినా.. గట్టిగా కాదని చెప్పే సాహసం కూడా చేయలేకపోతున్నారు. పైగా అన్నింటికీ మించి ఇప్పుడు తెలంగాణ భూగర్భజలవనరుల శాఖ.. ప్రతి చుక్కనూ పొదుపుగా వాడుకోవాలని హెచ్చరిస్తూ.. ప్రకటన జారీ చేయడం రాబోయే గడ్డుకాలానికి అద్దం పట్టింది.

తెలంగాణలో ఏపీతో పోలిస్తే వానలు పర్వాలేదనిపించినా.. కురవాల్సినంత వర్షాలైతే పడలేదనే చెప్పాలి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పుడు భూగర్భజలం కూడా అడుగంటడంతో.. తాగునీటికీ కొరత వచ్చి పడే సూచనలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో మిషన్ భగీరథ పథకం కింద గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించే 123 శుద్ధి కేంద్రాలకు రాష్ట్రంలోని 29 ప్రధాన జలాశయాలు ఆధారంగా ఉన్నాయి. ఈ 29 జలాశయాల మొత్తం నిల్వ సామర్థ్యం 1,059 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం కేవలం 333.44 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. గతేడాది ఇదే సమయంలో 522.31 టీఎంసీల నిల్వలు ఉండగా.. గతంతో పోలిస్తే ఈసారి పరిస్థితి మరింత దిగజారింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీకి పైన వినియోగించదగిన నీరు కేవలం 3 టీఎంసీలే మిగిలి ఉండగా.. ప్రతి నెల తాగునీటి అవసరాలకు సుమారు అర టీఎంసీ అవసరం అవుతోంది. లోయర్ మానేరు, ఎల్లంపల్లి, కడెం, జూరాల, నాగార్జునసాగర్, నిజాంసాగర్, సింగూర్, కోయిల్‌సాగర్, రామన్‌పాడు, అక్కంపల్లి, వైరా, ఉదయసముద్రం, ధర్మసాగర్ వంటి జలాశయాల్లోనూ నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలు ఈ జలాశయాలపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నిల్వలతో మంజీరా, సింగూర్, గోదావరి వ్యవస్థల నుంచి ఈ నెలాఖరు వరకు మాత్రమే తాగునీరు అందించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ అవసరాల కోసం సింగూర్‌లో కనీసం 16 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖకు సూచనలు వెళ్లాయి.

ఇదిలా ఉండగా భూగర్భ జలాల పరిస్థితి కూడా దిగజారుతోంది. నిజానికి జూన్ లోనే రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం 9.46 మీటర్ల లోతుకు పడిపోయింది. ఇప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉండొచ్చనే అంచనాలున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని బోర్లను మరింత లోతుగా తవ్వడం, అవసరమైన చోట కొత్త బోర్లు ఏర్పాటు చేయడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రభుత్వం చేపడుతోంది. దీనికి తోడు ఈశాన్య రుతుపవన కాలంలోనూ మంచి వర్షం పడే అవకాశం లేదనే సూచనలు వస్తున్నాయి. దీంతో ప్రస్తుత దుస్థితి కొనసాగటమే గొప్ప అనుకునేలా ఉంది. ఇంతకు మించి పరిస్థితులు దిగజారకుండా ఉంటే అదే పదివేలు అని సరిపెట్టుకోవడం తప్ప చేసేదేమీ లేదని కూడా ప్రభుత్వాల చర్యలు చెప్పకనే చెబుతున్నాయి. ఎందుకంటే ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా ఫలించని స్థాయిలో ప్రకృతి ప్రకోపం తలెత్తింది. ఇక ఇప్పుడు మానవ ప్రయత్నాలు ఫలించవని, చేయగలిగిందల్లా ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవడం, త్వరగా వర్షాలు పడాలని కోరుకోవడమేననే సూచనలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో రానున్న నెలల్లో తాగునీటి సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అటు ఏపీలో చూస్తే.. గతంలో ఎప్పుడూ నీటి కొరత అంటే తెలియని ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్య వస్తోంది. తమకు తాగునీటి సరఫరా సమస్య తీర్చాలని కొన్ని ప్రాంతాల్లో జనం రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు కూడా చేస్తున్నారు. అధికారులు ఎక్కడికక్కడ పరిష్కారాలు చూపుతున్నా.. అవి తాత్కాలికమే కానీ.. ఇక సమస్య రాదనే గ్యారెంటీ ఎవ్వరూ ఇవ్వలేని దుస్థితి. ఇదే పరిస్థితి కొనసాగితే తెలుగు రాష్ట్రాల్లో కరవు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. చివరకు చుక్క నీరు దొరక్క.. తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు అల్లాడే దుస్థితిని కూడా చూడాల్సి వచ్చేలా ఉందనే భయాలు వ్యక్తమౌతున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 12.10.2026
www.mudranews.in | @mudranews



**రైతులకు కీలక సూచన.. పంటల ఎంపికలో జాగ్రత్త!**

వర్షాలు ఆలస్యమయ్యే లేదా తక్కువగా కురిసే పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయంపై ప్రభావం పడవచ్చు. రైతులు స్థానిక వాతావరణ సూచనలను గమనిస్తూ, వ్యవసాయ అధికారుల సలహా మేరకు పంటలను ఎంచుకోవాలి. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలి. తక్కువ నీటితో సాగయ్యే పంటలు, డ్రిప్ ఇరిగేషన్ వంటి పద్ధతులను పరిశీలించడం ద్వారా నీటిని సమర్థంగా వినియోగించుకోవచ్చు.

## నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన

**ఏర్పాట్లు పూర్తి**

**ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మంత్రి తుమ్మల**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 11 :** నగర ఆధ్యాత్మిక చరిత్రలో మరొక అద్భుత ఘట్టానికి వేళయైంది. నగరంలోని అల్లీపురం వద్ద సుమారు 20 ఎకరాల విశాలమైన స్థలంలో శ్రీ వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఈ ప్రతిష్ఠాత్మక పవిత్ర నిర్మాణ కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది. రేపు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారి దివ్య హస్తాల మీదుగా ఈ ఆలయ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే టీటీడీకి చెందిన వేద పండితులు, రుత్వికులు క్షేత్రస్థాయిలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, యాగాలు, హోమాలను ప్రారంభించారు.ఈ శంకుస్థాపన వేడుకకు సంబంధించిన అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆలయ నిర్మాణ స్థలం, ప్రధాన వేదిక, ప్రముఖులు, భక్తుల రాకపోకలకు సంబంధించిన ప్రణాళికలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. శంకుస్థాపన కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగానే కాకుండా సరిహద్దు జిల్లాల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నీడ కోసం భారీ ఏర్పాట్లు చేశారు, వాహనాల పార్కింగ్ వసతులను సిద్ధం చేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులను ఏర్పాటు చేశారు. శంకుస్థాపన వేడుకకు వచ్చే భక్తులందరికీ అన్న ప్రసాదాన్ని, తిరుమల శ్రీవారి పవిత్ర లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో దివ్యమైన వేంకటేశ్వర స్వామి ఆలయం రూపుదిద్దుకోవడంపై ప్రజలు, ఆధ్యాత్మిక ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 14న భువనగిరి రౌండ్ టేబుల్ సమావేశం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సెక్షన్ 22-A పేరుతో బ్లాక్ లిస్టులో పెట్టిన భూములను వెంటనే బహిర్గతం చేయాలని, భూ సమస్యలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న (బుధవారం) ఉదయం 11 గంటలకు సుందరయ్య భవన్ భువనగిరిలో నిర్వహిస్తున్న "రౌండ్ టేబుల్ సమావేశం" ను జయప్రదం చేయాలని



తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ పేరుతో గతంలో పేదలకు పంచిన భూములను తిరిగి వెనక్కి తీసుకోవాలనే ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే చేపట్టి, మిగులు భూములను గుర్తించి అర్హులైన పేదలందరికీ పంచాలని ఆయన కోరారు.పేదల భూ హక్కుల రక్షణ కోసం, భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రజాస్వామికవాదులు, రైతు, కార్మిక సంఘాల నాయకులు, మేధావులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ విలువైన సలహాలు, సూచనలు అందించి సమావేశాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

## సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన

**మంత్రి పొంగులేటి**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 11 :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటీ, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్ దత్‌లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.అనంతరం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజలకు అందిస్తోందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత



విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం నిలిపివేస్తుందంటూ కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, ప్రజా ప్రభుత్వం ఈ పథకాన్ని నిరాటంకంగా అమలు చేస్తుందని భరోసా ఇచ్చారు.ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల ప్రపంచ వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ సమస్య తీవ్రమవుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకర పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో కరెంటును రూ. 15 పెట్టి కొనాలన్నా లభించని పరిస్థితి నెలకొందన్నారు. రైతాంగం వేసిన మొదటి పంటను కాపాడుకోవడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్ నీటి, విద్యుత్ కొరతను దృష్టిలో ఉంచుకుని రైతులు రెండో పంట వద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ వాణిశ్రీ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు ఇంచార్జీల నియామకం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 11 :** టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నియోజకవర్గాల వారీగా ఇంచార్జీలను నియమించినట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఖమ్మం నియోజకవర్గ ఇంచార్జిగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ గా పీసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబి స్వర్ణకుమారి, మధిర నియోజకవర్గ ఇంచార్జిగా శాసనమండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ ఇంచార్జిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జిగా శాసనమండలి మాజీ సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణలను నియమించినట్లు డీసీసీ అధ్యక్షులు వెల్లడించారు.నియమితులైన ఇంచార్జీలందరూ తక్షణమే తమకు కేటాయించిన నియోజకవర్గాల్లోని మండలాలను యూనిట్‌గా తీసుకుని, అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలని కోరారు.

## 16 న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 11 :** ఖమ్మంలోని ఎస్ఆర్ బిజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థుల రెండవ అపూర్వ సమ్మేళనం ఈనెల 16న నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నల్లమోతు తిరుమలరావు, కార్యదర్శి వి. ఆనంద్ తెలిపారు. విడిఓ కాలనీలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు.ఈ వేడుకకు పూర్వ విద్యార్థులందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఇటీవల మరణించిన పూర్వ విద్యార్థులకు సంతాప ప్రకటనతో సమ్మేళనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన 25 మంది పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించనున్నట్లు వెల్లడించారు. సీనియర్ల సందేశాలతో పాటు వినోదాత్మక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు అలేటి శ్రీనివాస్, ఇస్మాయిల్, ఎస్. మణిభూషణాచారి, కట్టెకోల చిన నర్సయ్య, సుదర్శన్, నాళ్ళ భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** నూతన గ్రామపంచాయతీలు, మండలాలు, జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, గదారి కిషోర్, పైళ్ల శేఖర్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, జిల్లా పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల యాదాద్రి భువనగిరి జిల్లా కలను 2016 లో తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన మన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేశారని అన్నారు. అలాంటి



నాయకుని మనమందరం కలిసి మళ్ళీ కేసీఆర్ ని ముఖ్యమంత్రి చేయాలని 2023 లో దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పైన పోరాటం చేసి కాంగ్రెస్ ప్రభుతని దించాలని పిలుపునిచ్చారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని రాకెట్ స్పీడ్ లో ఆగిపోయిన పనులన్నీ పూర్తి చేసుకుందామని అన్నారు. మొదటగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పూజలు నిర్వహించి గుమ్మడికాయ కొట్టారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, ధర్మేంద్ర రెడ్డి, తుంగ బాలు, పల్లె రవికుమార్, పైళ్ల రాజవర్ధన్ రెడ్డి, కల్లూరి రామచంద్ర రెడ్డి, మాజీ ఎంపీపీలు,మాజీ జడ్పీటీసీలు,మాజీ పట్టణ,మండల అధ్యక్షులు, సర్పంచులు,ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ నాయకుడు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** భువనగిరి మండలం అనంతారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల ఓబిసి ప్రధాన కార్యదర్శి దొనగిరి వేణు కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులు చింతల వెంకటేశ్వర రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో జండా మోసే సీనియర్ కాంగ్రెస్ నాయకులకు అన్యాయమే జరిగిందని పార్టీ సీనియర్లను పక్కనపెట్టి 12 పార్టీలు మార్చిన వారిని అందలమెక్కించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ అధ్యక్షులు జనగాం పాండు, గ్రామ శాఖ అధ్యక్షులు బొట్టు మల్లేశం, మాజీ సర్పంచ్ చిందం మల్లిఖార్జున, పి ఎ సి ఎస్ మాజీ డైరెక్టర్ గుమ్మడి సురేందర్ రెడ్డి,



తెరాస యూత్ వైస్ ప్రెసిడెంట్ పోల ప్రవీణ్ గౌడ్, సింగిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు వల్లపు విజయ్, వార్డు సభ్యులు దండెబోయిన బాలరాజు, సామల చంద్రమోహన్, కందాడి సంతోష్ రెడ్డి, కొండం శివ, చింతల నర్సిరెడ్డి, పల్లెపాటి నరసింహ, బొట్టు శేఖర్, కొంగల సాయి, రేపాక నరేష్, మచ్చ శివ, సాయి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖమ్మంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 11 :** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నగరంలోని అల్లిపురం వద్ద శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నారు ఈ నేపథ్యంలో ఉదయం 9:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.కార్యక్రమానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. ఖమ్మం పట్టణం వైపు నుంచి వచ్చే భక్తులు రోడ్డుకు ఎడమవైపున ఏర్పాటు చేసిన పార్కింగ్ 'ఏ' లో వాహనాలను నిలపాలి. కొదుమూరు, అల్లిపురం వైపు నుంచి వచ్చేవారికి పార్కింగ్ 3లోను, రామకృష్ణాపురం వైపు నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ 4 స్థలంలోను వసతి కల్పించారు. వీఐపీల వాహనాల నిమిత్తం ప్రత్యేకంగా మరొక స్థలాన్ని కేటాయించారు.ప్రధాన రహదారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను పార్క్ చేయరాదని, దీనివల్ల భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రోడ్డు నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు. భక్తులందరూ ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ, కేటాయించిన స్థలాల్లోనే వాహనాలు నిలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు



**ముద్ర, దేవరకొండ:** తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ వేడుకలు ఎంగిలి పూల బతుకమ్మ తో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ పండుగలో మొదటి రోజును ఎంగిలి పూల బతుకమ్మగా జరుపుకుంటారు.ఈ సందర్భంగా కొండమల్లేపల్లి మండలం లో మహిళలు, ఆడపడుచులు, చిన్నారులు తెల్లవారుజామునే లేచి పూలు సేకరించి, రంగురంగుల పూలతో చిన్న చిన్న బతుకమ్మలను పేర్చారు. ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. మహాలయ అమావాస్య రోజున జరుపుకునే ఎంగిలి పూల బతుకమ్మకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ రోజు నుండి తొమ్మిది రోజుల పాటు తెలంగాణ అంతటా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటుతాయని మహిళలు తెలిపారు.ఈ వేడుకల్లో మహిళలు పట్టుచీరలలో, చిన్నారులు సంప్రదాయ దుస్తులలో పాల్గొని బతుకమ్మ పాటలు ఆలపిస్తూ నృత్యం చేశారు.

## కొండమల్లేపల్లిలో నేడు జల్సాయే సీరతున్నబి



**ముద్ర, దేవరకొండ:** జల్సాయే సీరతున్నబి ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి పవిత్ర జీవిత చరిత్ర వారి బోధనలు సమాజానికి వారు అందించిన సందేశాలను స్మరించుకుంటూ ఆయన గుణగణాలను కొనియాడుతూ నిర్వహించే ఒక పవిత్రమైన కార్యక్రమంగా నిర్వహించే ఒక ఆధ్యాత్మిక సభ. ఈ సభలో ఇస్లామిక్ పండితులు, ఉలేమాలు ప్రవక్త ముహమ్మద్ గారి జననం, ఆయనకు లభించిన ప్రవక్త పదవి, ఆయన పడిన కష్టాలు ఇస్లాం వ్యాప్తి కోసం ఆయన చేసిన త్యాగాలను వివరిస్తారు. ముహమ్మద్ ప్రవక్త గారు సమాజానికి అందించిన శాంతి, కరుణ, సోదరభావం, పేదలను ఆదుకోవడం, మహిళలకు గౌరవం ఇవ్వడం వంటి ఉన్నతమైన బోధనలను ప్రజల్లోకి తీసుకెళ్తారు. మానవాళికి ఒక ఆదర్శవంతమైన మార్గదర్శిగా ప్రవక్త గారు ఎలా జీవించారో వివరించి, ముస్లింలు తమ దైనందిన జీవితంలో ఆ సూత్రాలను ఎలా పాటించాలో తెలియజేస్తారు. ఈ సభలలో ప్రవక్త గారిని కీర్తిస్తూ నాత్-ఎ-షరీఫ్ పద్యాలు లేదా ప్రశంస గీతాలు భావ గర్భితంగా ఆలపిస్తారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జనప్రియ గార్డెన్ లో నేడు జమీయతుల్ ఉలేమా ఆధ్వర్యంలో నిర్వహించే జల్సా యే సీరతున్నబి కార్యక్రమంలో ముస్లిం సోదర సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని సీరతున్నబి జల్సాను విజయవంతం చేయాలని జమీయతే ఉలేమా హింద్ మండల అధ్యక్షుడు మొహమ్మద్ నజీరుద్దీన్ మౌలానా ఖాస్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జల్సాయే సీరత్ ఉన్నబిలో హజ్రత్ మౌలానా సయ్యద్ షా ఎహ్సానుద్దీన్ సాహెబ్ మద్‌జిల్లుహుల్ ఆలీ అధ్యక్షులు జమీయతుల్ ఉలెమా తెలంగాణ, నాజిమ్ దారుల్ ఉలూమ్ నల్గొండ, ముఖ్య అతిథులుగా హజ్రత్ ముఫ్తీ సయ్యద్ అమ్జద్ అలీ సాహెబ్ ఖాస్మి దామత్ బరకాతుహుమ్ఖతీబ్ ఈద్గా దేవరకొండ, హజ్రత్ ముఫ్తీ అహ్మదుల్లా నిసార్ సాహెబ్ ఖాస్మి మద్‌జిల్లుహుల్ ఆలీ ఖలీఫా వ మజాజ్ హజ్రత్ మౌలానా పీర్ జుల్ఫికార్ సాహబ్ నూరల్లాహు మర్‌ఖదహు నాజిమ్ దారుల్ ఉలూమ్ రషీదియా హైదరాబాద్, అల్‌హాజ్ గౌస్ మొహియుద్దీన్ సాహెబ్ అధ్యక్షులు జమీయతుల్ ఉలమా చింతపల్లి ముఖ్య అతిథుల సమక్షంలో జల్సా కార్యక్రమం నేడు సోమవారం ఉదయం 8 గంటల నుండి జోహార్ నమాజ్ వరకు జల్సా నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలకు పరదా కోసం ప్రత్యేకమైన పూర్తి ఏర్పాట్లు ఉన్నాయన్నారు.

## స్వర్ణగిరిలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**- వైభవంగా మహాలక్ష్మి హవనం.**

**.పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి .ఉత్సవాలలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం వంటి వైదిక క్రతువులను జరిపి,పుట్టమన్నును సేకరించి,అందులో భూదేవిని ఆవాహనం చేసి అర్పించారు. అనంతరం మృత్సంగ్రహణం చేసి అంకురార్పణ గావించారు, దేశంలో సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని అర్చకులు ప్రార్థించారు.దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా స్వర్ణగిరి క్షేత్రం కడు రమణీయంగా వెలుగొందుతున్నది. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు మహాలక్ష్మి అమ్మవారికి పాలు,పెరుగు వంటి విశేష ద్రవ్యాలతో అభిషేకించారు.దసర శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు మహాలక్ష్మి అమ్మవారికి హవనం నిర్వహించారు.సాయంత్రం 6:30 కు పద్మావతి అమ్మవారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ పద్మావతి అమ్మవారిని తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.దసర శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు విశేషంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

**పెద్దమ్మ ఆలయంలో..**

భువనగిరి పట్టణంలోని కిసాన్ నగర్ లో ఉన్న పెద్దమ్మ గుడిలో దుర్గాష్టమి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొలుపుల వివేకానంద, కుక్కదుగ సోమయ్య, నీల శ్రీనివాస్, గుర్రాల శివకుమార్ తుపాకుల శ్రీనివాస్, కనుక బాలరాజ్, ఇండ్ల కృష్ణ, గొరెంకల లక్ష్మి, మంజుల, సీనియర్ రిపోర్టర్ మల్లేశం , భీష్మ పంతులు, ముల్కల సత్యనారాయణ, ఎర్రబోయిన శ్రీనివాస్, పాల్గొన్నారు



**ఎండలో బయటకు వెళ్తున్నారా?**

ఈ జాగ్రత్తలు తప్పనిసరి!ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎండ నుంచి రక్షణ పొందడం ముఖ్యం. అత్యవసరమైతే తప్ప ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య బయటకు వెళ్లకపోవడం మంచిది. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, పలుచని కాటన్ దుస్తులు ధరించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే నీడలోకి వెళ్లి వైద్య సహాయం పొందాలి.

# వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

**ఏడుపాయలలో పట్టు వస్త్రాలు సమర్పించిన అదనపు కలెక్టర్ నగేష్**

**బాలత్రిపుర సుందరిగా 'వనదుర్గ'**

**చిట్కూల్ లో ప్రారంభం**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత సన్నిధిలో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. గణపతి పూజ, అఖండ దీపారాధనతో ఉత్సవాలు ప్రారంభించారు. బాలా త్రిపుర సుందరి దేవి (తైలపుత్రి)గా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి తెల్లవారుజామున ఆలయ అర్చకులు శంకర్ శర్మ, పార్తీవ శర్మల ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం, అలంకరణ, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం ఉత్సవమూర్తి అమ్మవారిని పల్లకిలో ఉంచి గోకుల్ షెడ్ వరకు పల్లకి సేవ నిర్వహించారు. అమ్మవారిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పల్లకి మోశారు. అమ్మవారి గర్భగుడి, ఉత్సవ మూర్తి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ వీరేశం పర్యవేక్షించారు. ఈ పూజలలో ఎంపీపీ మాజీ అధ్యక్షురాలు చందన ప్రశాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటీసీ మల్లప్ప, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాగి అశోక్, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ డైరెక్టర్ రాగి చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్ రాము, నాయకులు గోదల సాయి రాం, నాగిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిట్కూల్ చాముండేశ్వరి దేవికి మహాభిషేకం మెదక్ జిల్లా చిలప్ చెడ్ మండలం చిట్కూల్ శివారులో మాజీరా నది తీరాన వెలసిన చాముండేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారికి మహాభిషేకం నిర్వహించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా అర్చకుడు ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పేరూరులో....ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న మంజీరా నది ఒడ్డున వెలసిన శ్రీ సరస్వతి క్షేత్రంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు దొర్బల రాజమౌళి శర్మ, అర్చకులు మహేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ మంగళ హారతి తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు











అమ్మవారిని దర్శించుకున్నారు. మెదక్ పట్టణంలోని కాళికాదేవి ఆలయంలో ప్రధాన అర్చకులు శివరామచారి ఆధ్వర్యంలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీ స్వర్ణ కవచ అలంకృత మహా కాళికాదేవిగా దర్శనం ఇచ్చారు. పసుపులేరు ఒడ్డున వెలసిన రేణుక మాత ఆలయంలో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

## మెదక్ లో కేంద్రం దిష్టిబొమ్మ దహనం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** సర్ కు వ్యతిరేకంగా శాంతియుతంగా జరిగిన నిరసనను అడ్డుకోవడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య అన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసి కేంద్రప్రభుత్వం మరోసారి తన నియంతృత్వ పోకడలను నిరూపించుకుందని నిరసిస్తూ జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో ఆదివారం కేంద్రం దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ దేశంలో ప్రతిపక్షాలు, ప్రశ్నించే వారు లేకుండా చేసే కుట్రలో భాగంగానే సర్ పేరుతో ఎన్నికల కమిషన్ ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన గుప్పెట్లో పెట్టుకుందని విమర్శించారు. నిష్పక్షపాతంగా పని చేయాల్సిన ఎన్నికల కమిషన్ నరేంద్ర మోడీ, అమితాషా ల జేబు సంస్థగా మారిందన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ బిజెపి కార్యకర్తల వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కార్యాలయం ముందు శాంతియుత ధర్నాకు పిలుపు ఇస్తే దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిదంగా ఢిల్లీకి వివిధ రాష్ట్రాల నుండి వెళ్లే రైళ్ళని, మెట్రో స్టేషన్ లను మూసివేసి ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇళ్ళవద్దనే అరెస్టు చేసి తన నియంతృత్వాన్ని చాటుకుందని విమర్శించారు. ఈ నిరసనలో సిపిఎం మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ. మల్లేశం, కె. మల్లేశం, వెంకట్, దుర్గ యాదగిరి, షౌకత్, లచ్చగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రుల వేళ పద్మ గాజుల సందడి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి మెదక్ పట్టణంలోని ఓ గాజుల దుకాణాన్ని సందర్శించి గాజులు కొనుగోలు చేసి సందడి చేశారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్‌లు అరేళ్ళ.గాయత్రి, గడ్డమీద యశోదతో కలిసి దుకాణానికి వచ్చిన మహిళలు, చిన్నారులకు గాజులు కొనిచ్చి, స్వయంగా తొడిగారు.నవరాత్రుల వేళ మహిళలు సంప్రదాయబద్ధంగా గాజులు ధరించడం ఎంతో ఆనందాన్నిస్తుందని పేర్కొన్నారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. అంతకుముందు శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, రామాలయ కమిటీ అధ్యక్షుడు బండ నరేందర్, మాజీ కౌన్సిలర్ ఆర్కే శ్రీనివాస్, నాయకులు లింగారెడ్డి తదితరులున్నారు.

## జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో

## 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్' విద్యార్థుల ప్రతిభ

**ఘనంగా 9 పతకాలు కైవసం**

**3 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలు సాధించిన క్రీడాకారులు**







**ముద్ర, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. తమ పట్టుదల, క్రీడాస్ఫూర్తితో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో రాణించి ఏకంగా 9 పతకాలు (3 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలు) సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.బాలికల అండర్–10 విభాగంలో సిహెచ్. లాస్య శ్రీ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. 60 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో రెండు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని స్టార్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. ఇదే విభాగంలో లంక పార్వతి నిలకడైన ప్రతిభ కనబరిచి రెండు విభాగాల్లోనూ రజత పతకాలను సొంతం చేసుకుంది.ఫీల్డ్ ఈవెంట్లలో అండర్–10 బాలికల లాంగ్‌జంప్‌లో సాన్విక గౌడ్ కాంస్యం సాధించగా, అండర్–12 లాంగ్‌జంప్‌లో ఎం. అశ్విని రజత పతకం కైవసం చేసుకుంది. అండర్–14 బాలికల 60 మీటర్ల పరుగు పందెంలో సింధం వజ్ర వరుణవి కాంస్య పతకం గెలుచుకుంది.బాలుర విభాగంలోనూ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ క్రీడాకారులు మెరిశారు. అండర్–12 బాలుర 300 మీటర్ల పరుగులో సిహెచ్. రితేష్ రజతం సాధించగా, సిహెచ్. జీవన్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు.విద్యార్థుల కఠోర సాధన, క్రమశిక్షణతో పాటు వారి తల్లిదండ్రులు, కోచ్‌లు, పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహమే ఈ ఘనతకు కారణమని పాఠశాల వర్గాలు తెలిపాయి. ప్రతిభ చాటి పతకాలు సాధించిన విద్యార్థులను, పోటీల్లో పాల్గొన్న వారిని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ క్రీడల్లో వారిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పాఠశాల నిరంతరం కృషి చేస్తుందని పేర్కొంది. ఈ విజయం 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ టీం'కు గర్వకారణమని హర్షం వ్యక్తం చేసింది.

# తెలంగాణ భాష జీవభాష..

**పండిత, పామరులను అలరించే సాహిత్యం మన సొంతం - తెలంగాణ రక్షణ సేన అధినేత కవిత**

**'సరస్వతీరాజ్–హరిదా అంతర్జాతీయ ఉత్తమ తెలంగాణ కథా పురస్కారం–2026' పోటీల గోడపత్రిక ఆవిష్కరణ**

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ భాష జీవభాష అని, ఆ భాషలోని సాహిత్యం పండితులు, పామరులను ఒకే విధంగా అలరిస్తుందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ భాషలోని మాధుర్యాన్ని, సోయగాన్ని భావితరాలకు అందించేందుకు హరిదా రచయితల సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. శనివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 'సరస్వతీరాజ్–హరిదా అంతర్జాతీయ ఉత్తమ తెలంగాణ కథా పురస్కారం–2026' పోటీల గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ భాషలోని పదబంధాలు, నుడికారాలు, సామెతలు, సంస్కృతిని కథల రూపంలో ముందు తరాలకు అందించడం గొప్ప ప్రయత్నమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ భాషలో కథల పోటీలు నిర్వహించడం ఆదర్శనీయమని ప్రశంసించారు. తెలంగాణ భాషలో కథలు రాయగల రచయితలందరికీ ఇది మంచి అవకాశమని, ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కథలతోనే భాషా వైభవం సజీవం: అనన్య నాగళ్లఏ భాష గొప్పతనమైనా కథల ద్వారానే తెలుస్తుందని ప్రముఖ సినీ నటి అనన్య



నాగళ్ల అన్నారు. ఒక ప్రాంత భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కథలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ రచయితల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు హరిదా రచయితల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. రచయితలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.తెలంగాణ సంస్కృతిని చాటేందుకే కథల పోటీలు: ఘనపురం దేవేందర్తెలంగాణ భాష, సంస్కృతి, జీవన విధాన వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు భావి తరాలకు అందించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ భాషలో కథలు రాసే రచయితలందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ఆత్మ, ప్రజల జీవితం, సంస్కృతి, భాష, జీవన విధానాన్ని ప్రతిబింబించే అంశాలతో కథలు రాయాలని సూచించారు. కథల్లో తెలంగాణతనం తప్పనిసరిగా కనిపించాలన్నారు. గతంలో ఎక్కడా ప్రచురితం కాని, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయని, ఇతర పోటీలకు పంపని కొత్త కథలను మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. అనువాదాలు, అనుకరణలు, అనుసరణలకు అవకాశం లేదన్నారు.కథలను అక్షర దోషాలు లేకుండా యూనికోడ్‌లో 14 సైజు అక్షరాలతో టైప్ చేసి, ఏ4 పరిమాణంలో గరిష్ఠంగా ఎనిమిది పేజీలకు మించకుండా పంపాలని సూచించారు. కథ పేజీలపై రచయిత పేరు ఉండకూడదని, నిబంధనలను అంగీకరిస్తూ ప్రత్యేకంగా జతచేసే హామీపత్రంలో మాత్రమే రచయిత పేరు, చిరునామా, ఫోన్ నంబరు, ఈమెయిల్ వివరాలు పొందుపరచాలని తెలిపారు. విజేతల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని వెల్లడించారు.ఉత్తమ కథకు రూ.10 వేల నగదు పురస్కారంపోటీల్లో ప్రథమ ఉత్తమ కథకు రూ.10 వేల నగదు పురస్కారం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తదుపరి తొమ్మిది ఉత్తమ కథలకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదు పురస్కారంతో పాటు సత్కారం ఉంటుందని వెల్లడించారు. డిసెంబర్ 4న నిజామాబాద్‌లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించే హరిదా రచయితల సంఘం మహాసభలో విజేతలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి గల రచయితలు తమ కథలు, హామీపత్రాలను అక్టోబర్ 30లోగా haridaasaraswathiraj@gmail.com చిరునామాకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9030033331 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రంగు నవీనాచారి, నాయకులు రూప్‌సింగ్, శరత్ పాల్గొన్నారు.

## దసరా సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలి

**పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ వహించాలి**

**ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు ప్రయాణాలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరిగి విషాదం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.పండుగ సెలవుల్లో పిల్లలు చెరువులు, కుంటలు, కాలువలు, బావులు, ఈత కొలనుల వద్దకు ఒంటరిగా వెళ్లకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని ఎస్పీ సూచించారు. ఈతకు వెళ్లే సమయంలో పెద్దలు తప్పనిసరిగా



తోడుండాలని, నీటి లోతు తెలియని ప్రాంతాల్లోకి దిగకుండా చూడాలని తెలిపారు. పండుగల సందర్భంగా ప్రయాణాలు చేసేవారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. అతివేగం, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ప్రజలందరూ పోలీసుల సూచనలు పాటిస్తూ వ్యక్తిగత భద్రతకు, కుటుంబ సభ్యుల రక్షణకు ప్రాధాన్యతనివ్వాలని ఎస్పీ తెలిపారు. దసరా, బతుకమ్మ పండుగలను ప్రజలందరూ సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.


Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L. N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555